**నీలగిరి ఎక్స్‌ప్రెస్**
తెలుగు దినపత్రిక
RNI - TELTEL/2023/87644


## నీలగిరి నిత్యపద్యం

బ్రతుకునందు నరుడు భయమును లేకున్న
జీవనగమనంబు జేయుచుండు
బాధ్యతలను మరిచి పరుగులు సాగించ
భవితయంతగూడ భంగపడును

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి


**విలేకరులు కావలెను**

నీలగిరి ఎక్స్‌ప్రెస్ దినపత్రిక మరియు చైతన్యగళం ఛానెల్ లో పనిచేయుటకు మండల విలేఖర్లు, నియోజకవర్గ,జిల్లా ఇంచార్జీలు, క్రైమ్ రిపోర్టర్లు కావలెను.

**పూర్తి వివరాలకు**
తెలంగాణ - 9705770909,
ఆంధ్రప్రదేశ్ -9491163914
లను సంప్రదించగలరు.



సంచిక 41 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | ఆదివారం | ఆగస్టు 09, 2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00




# ప్రశ్నలతో ఆగొద్దు.. పరిష్కారాలు చూపండి

**యువత సామర్థ్యాలపై పూర్తి నమ్మకం ఉంది**

**వారి ఆలోచనలు, నిర్ణయాలే వికసిత్ భారత్‌కు దిశానిర్దేశం : ప్రధాని మోడీ**

**ఐఐటీ ఢిల్లీ స్నాతకోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు**

**న్యూఢిల్లీ,ఆగస్టు 08 :** దేశ యువత సమస్యలను గుర్తించి ప్రశ్నించడం మాత్రమే కాకుండా, వాటికి పరిష్కారాలను కనుగొనే దిశగా ఆలోచించాలని ప్రధాని మోడీ సూచించారు. యువత సామర్థ్యాలపై తనకు పూర్తి నమ్మకం ఉందని అన్నారు. వికసిత్ భారత్ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాల్సి ఉందని పిలుపునిచ్చారు. ఐఐటీ ఢిల్లీ స్నాతకోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మోడీ..పట్టభద్రులైన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు ఇప్పుడు అడుగుపెడుతున్న ప్రపంచం వేగంగా మారుతోందని చెప్పారు. సాంకేతికతతో పాటు అనేక రంగాల్లో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయ న్నారు. రాబోయే 20--30 ఏండ్లలో ప్రపంచంలో ఎలాంటి మార్పులు మిగతా2లో...

# ఎల్‌నినోతో సాగునీటికి కష్టాలు

**సాగర్ నీళ్లు తాగడానికే సరిపోవు**

**రైతులు ఆరుతడి పంటలనే వేయాలి**

**సాగునీటి సలహామండలి సమావేశంలో కోమటిరెడ్డి**




**నల్గొండ ఆగస్టు 08 :** ఎల్‌నినో కారణంగా ప్రస్తుతం నాగార్జునసాగర్ ప్రాజెక్టులో ఉన్న నీరు తాగునీటికే సరిపోతుందని, అంతేకాక పైనుంచి నీరు వచ్చే అవకాశం కూడా లేనందున రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ వరి వేయకుండా ఆరుతడి పంటలు వేసుకునేలా అధికారులు అవగాహన కల్పించాలని మిగతా2లో...

# ప్రాజెక్టుల భూసేకరణకు రూ. 5వేల కోట్లు

**అటవీ, పర్యావరణ అనుమతులపై నిర్లక్ష్యం వద్దు**

**మిడ్ మానేర్ ఎడమ కాలువ పనుల పునః ప్రారంభం : నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి**



**హైదరాబాద్, ఆగస్టు 08 :** సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ, పునరావసం కోసం రూ.5 వేల కోట్లు మంజూరు చేశామని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. నిధుల కొరత కారణంగా సాగునీటి పనులు ఆగొద్దని పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్‌లోని బీర్.అంబేడ్కర్ సచివాల యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా సాగునీటి ప్రాజెక్టులపై మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, డి. శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఇందులో ఇప్పటికే రూ.2 వేల కోట్లు విడుదలయ్యాయనీ, మిగిలిన రూ.3 వేల కోట్లు ప్రాధాన్యతా క్రమంలో మిగతా2లో...

# క్షుద్ర రాజకీయాలు కాంగ్రెస్‌కే చెల్లు

- తెలంగాణ కోసం కొట్లాడిన మాకు తెలియదు
- నీటి వాటాల విషయంలో తేడా వస్తే తెలంగాణ భగ్గుమంటది
- నీళ్లు ఎత్తిపోయడం కూడా చేతకాని సిఎం రేవంత్ రెడ్డి
- మీడియా సమావేశంలో మండిపడ్డ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




**హైదరాబాద్,ఆగస్టు 08 :** క్షుద్రపూజలు అని చెప్పి క్షుద్ర రాజకీయాలు చేస్తున్నది కాంగ్రెస్ పార్టీయేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ కోసం కొట్లాడిన వాళ్లం. తెలంగాణ కోసం త్యాగాలు చేసిన వాళ్లం. క్షుద్ర రాజకీయాలు చేయవలసిన అవసరం మిగతా2లో...

# డిలిమిటేషన్‌పై తమిళనాట ఆసక్తికర సన్నివేశం

**సిఎం విజయ్ నేతృత్వంలో అఖిలపక్ష ఎంపిల భేటీ**

**ఉన్న ఎంపి సీట్లను అలాగే కొనసాగించాలని డిమాండ్**




**చెన్నై,ఆగస్టు 08 :** కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న 'డీలిమిటేషన్' ప్రక్రియపై తమిళనాడు రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. రాష్ట్ర రాజకీయ ప్రాతినిధ్యం తగ్గకుండా అడ్డుకునేందుకు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ శనివారం చెన్నైలోని కలైవానర్ అరంగంలో తమిళనాడు ఎంపీలతో అత్యవసర సమావేశం నిర్వహించారు. అయితే, రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలైన డీఎంకే, అన్నాడీఎంకేలతో పాటు పీఎంకే, డీఎండీకే ఈ భేటీని బహిష్కరించడం చర్చనీయాంశమైంది. పార్టీ రాజకీయాలకు అతీతంగా తమిళనాడు హక్కుల పరిరక్షణెళి లక్ష్యంగా కాంగ్రెస్, విసికె, సిపిఐ సిపిఎం, ఎండిఎంకె, ఐయూఎంఎల్ పార్టీలకు చెందిన దాదాపు 21 మంది లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలు ఈ భేటీలో మిగతా2లో...



# నేడు,రేపు హైదరాబాద్ బోనాలు

**- పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు**

**హైదరాబాద్,ఆగస్టు 08 :** హైదరాబాద్‌లో బోనాల ఉత్సవాలు ఆగస్టు 9, 10 తేదీల్లో జరగనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు. లాల్ దర్వాజా, కార్వాన్ దర్బార్ మైసమ్మ, అంబర్‌పేట్ మహంకాళి, చిలకలగూడ కట్ట మైసమ్మ ఆలయాల పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు వెల్లడించారు. లాల్ దర్వాజా బోనాల మిగతా2లో...

# నిరుద్యోగులంటే ఎందుకింత కక్ష

**● సరూర్ నరగ్ ఘటన ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యమే ● రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ హామీ మోసానికి నిదర్శనం ● ఎక్స్ వేదికగా మండిపడ్డ బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు**



**హైదరాబాద్, ఆగస్టు 08 :** హైడ్రాలో డ్రైవర్ పోస్టుల భర్తీకి వచ్చిన నిరుద్యోగులను ప్రభుత్వం అవమానించిందంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. విద్యార్థులు, నిరుద్యోగులు అంటే ప్రభుత్వానికి ఎందుకింత కక్ష అంటూ మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేస్తూ.. 32 నెలలు దాటినా ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని దుయ్యబట్టారు. రెండు లక్షల ఉద్యోగాల హామీ బోగస్ అయ్యిందంటూ ఫైర్ అయ్యారు. అధికారం కోసం ఎన్నికల సమయంలో విద్యార్థులు, నిరుద్యోగులను నెత్తిన పెట్టుకున్నారు. ఉద్యోగాలు ఇస్తామని హామీలు గుప్పించారు. ఇప్పుడు అదే నిరుద్యోగులు ఉద్యోగాల కోసం రోడ్ల మీదకు వస్తే వారి పట్ల ఇంత కర్కశంగా వ్యవహరిస్తారా అని ప్రశ్నించారు. హైడ్రాలో కేవలం 150 డ్రైవర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇస్తే వేలాది మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకునేందుకు తరలివచ్చారు. ఇది నిరుద్యోగుల తప్పా లేక మిగతా2లో...

# ఇకనుంచి స్మార్ట్ రేషన్ కార్డులు

**15 ఆగస్టున ప్రారంభించనున్న సిఎం**



నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక

# ప్రశ్నలతో ఆగొద్దు..పరిష్కారాలు చూపండి

(మొదటి పేజీ తరువాయి)

వస్తాయో ముందుగానే చెప్పడం సాధ్యం కాదని చెప్పారు. అందువల్ల యువతలో ఎప్పుడూ నేర్చుకోవాలనే ఆసక్తి ఉండా లన్నారు. జీవితాంతం విద్యార్థులుగా కొనసాగాలని సూచించారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కొత్త విషయాలను నేర్చుకునేవారే విజయాన్ని అందుకుంటారని తెలిపారు.

**సమస్యలను చూసి భయపడొద్దు** జీవితంలో వచ్చే సమస్యలను చూసి భయపడాల్సిన అవసరం లేదని, పెద్ద సవాళ్లను చిన్న చిన్న భాగాలుగా విభజించి వాటికి పరిష్కారాలను అన్వేషించాలని మోడీ సూచించారు. కొత్త ఆలోచనలు, వినూత్న పరిష్కారాలను కనుగొనే ధైర్యం ఉంటే సవాళ్లను అవకాశాలుగా మార్చుకోవచ్చునన్నారు. ప్రతి తరానికీ దేశం పట్ల బాధ్యత ఉంటుందని మోడీ వివరించారు. రాబోయే 30--35 ఏండ్లలో యువత తీసుకునే నిర్ణయాలు, చేపట్టే కార్యక్రమాలే వికసిత్ భారత్ దిశను ప్రభావితం చేస్తాయని అన్నారు. తాము తీసుకునే ప్రతి నిర్ణయం దేశానికి ఎంతవరకు ఉపయోగపడుతుందో యువత ఆలోచించాలని పిలుపునిచ్చారు. దేశ ప్రయోజనాల కోసం తాము ఏమి చేయగలమనే ప్రశ్నను ప్రతి యువకుడు తనకు తాను వేసుకోవాలని మోడీ సూచించారు.

**విద్యార్థులకు స్వర్ణ పతకాలు ప్రదానం** స్నాతకోత్సవంలో ప్రతిభ కనబరిచిన పలువురు విద్యార్థులకు దీన్‌దయాల్ శర్మ స్వర్ణ పతకం, డైరెక్టర్ స్వర్ణ పతకాలను మోడీ ప్రదానం చేశారు. పురస్కారాలు అందుకున్నవారిలో మహిళల సంఖ్య తక్కువగా ఉండటాన్ని ఆయన ప్రస్తావిస్తూ.. మరింత మంది మహిళలు ఈ స్థాయిలో ప్రతిభ చూపాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఐఐటీ ఢిల్లీ సోనిపత్ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన ఏఐ ఆధారిత సూపర్ కంప్యూటింగ్ కేంద్రం 'పరం ప్రజ్ఞ'ను ప్రధాని ప్రారంభించారు.

# డిలిమిటేషన్‌పై తమిళనాట ఆసక్తికర సన్నివేశం

(మొదటి పేజీ తరువాయి)

పాల్గొన్నారు. దేశ వ్యాప్తంగా లోక్‌సభ స్థానాల సంఖ్యను 543 వద్దే ఉంచాలని ఈ సందర్భంగా ఎంపీలు డిమాండ్ చేశారు. తమిళనాడుకు ప్రస్తుతం ఉన్న 39 లోక్‌సభ స్థానాల కేటాయింపులో ఎలాంటి మార్పులు చేయకూడదని స్పష్టం చేశారు. దశాబ్దాలుగా తమిళనాడు, కేరళ వంటి దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలు చేశాయని ఎంపీలు గుర్తుచేశారు. ఇప్పుడు కేవలం జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల సంఖ్యను పెంచితే, జనాభా పెరిగిన ఉత్తరాది రాష్ట్రాలకు లబ్ది చేకూరి, దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్యం తీవ్రంగా తగ్గుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తమిళనాడు పాత్రను పార్లమెంట్‌లో తగ్గించే ఏ డీలిమిటేషన్ సూత్రాన్నైనా తీవ్రంగా నిరసిస్తామని, లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచితే అది ప్రభావవంతమైన పార్లమెంట్ కాబోదని కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం పేర్కొన్నారు. తమిళనాడును ఇన్నేళ్లు పాలించిన డీఎంకే, అన్నాడీఎంకేలు రాష్ట్ర హక్కుల కోసం నిర్వహిస్తున్న భేటీకి రాకపోవడం విచారకరమని, వారికి రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కంటే రాజకీయాలే ముఖ్యమని కాంగ్రెస్ ఎంపీలు ప్రవీణ్ చక్రవర్తి, విష్ణు ప్రసాద్ విమర్శించారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన 57 మంది ఎంపీలలో 36 మంది ఈ భేటీకి దూరంగా ఉండటం, విజయ్ ప్రభుత్వానికి స్పష్టమైన ఎజెండా లేదంటూ డీఎంకే ఆరోపించడం.. తమిళనాడు రాజకీయ సమీకరణాలను మరింత ఆసక్తికరంగా మార్చాయి.

# ప్రాజెక్టుల భూసేకరణకు రూ. 5వేల కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

విడుదల చేస్తామని చెప్పారు. నిధుల కొరత కారణంగా చివరి దశలో ఉన్న ఏ సాగునీటి ప్రాజెక్టు కూడా నిలిచిపోవడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ప్రాజెక్టుల నిర్మాణంలో భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్, అటవీ, పర్యావరణ అనుమతులను అత్యంత ప్రాధాన్య అంశాలుగా తీసుకోవాలని కలెక్టర్లను మంత్రి ఆదేశించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రాజెక్టుల వారీగా ఎన్ని నిధులు అవసరమో వెంటనే ప్రతిపాదనలు పంపాలనీ, అవసరమైన ఆర్థిక అనుమతులు, టోకెన్లు పొందడంలో జాప్యం చేయవద్దని సూచించారు. నాలుగున్నరేండ్లుగా నిలిచిపోయిన మిడ్‌మానేరు ఎడమ కాలువ మిగులు పనులను తక్షణమే పునఃప్రారంభించాలని మంత్రి ఆదేశించారు.సవరించిన అంచనాలు సిద్ధం చేయడం, భూసేకరణ, టెండర్ల ప్రక్రియ, చట్టబద్ధ అనుమతుల సాధన... ఒకదాని తర్వాత మరొకటి కాకుండా సమాంతరంగా ముందుకు సాగాలని స్పష్టం చేశారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలో ప్రతిపాదించిన లక్ష్మీనరసింహస్వామి పత్తిపాక రిజర్వాయర్‌ను వేగంగా ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు. ఈ పథకం ద్వారా కొత్తగా 10 వేల ఎకరాలకు సాగునీరు అందించడంతోపాటు కాకతీయ ప్రధాన కాలువలో డి-83 నుంచి డి-94 వరకు ఉన్న 2.40 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు.

లైడార్ సర్వే, డేటా ప్రాసెసింగ్ ఇప్పటికే పూర్తయ్యాయనీ, బోర్‌హోల్ డ్రిల్లింగ్, ట్రయల్ పిట్స్, జియోటెక్నికల్ పరిశోధనలు కొనసాగుతున్నా యని అధికారులు మంత్రికి వివరించారు. ఆగస్టు నెలాఖరులోగా డీపీఆర్ సమర్పిస్తామని తెలిపారు. సమీక్షలో ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన ప్రతి సమస్యను 'యాక్షన్ పాయింట్'గా మార్చాలని, తదుపరి సమావేశం నాటికి వాటిపై తీసుకున్న చర్యల నివేదికను సమర్పించాలని అధికారులకు సూచించారు.

**రోళ్లవాగు 96 శాతం పూర్తి.....** జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలంలోని రోళ్లవాగు ప్రాజెక్టు పనులు 96 శాతం పూర్తయ్యాయని అధికారులు మంత్రికి వివరించారు. ప్రస్తుతం ఉన్న 0.250 టీఎంసీల నిల్వ సామర్థ్యాన్ని 0.949 టీఎంసీలకు పెంచి, స్థానిక పరీవాహక ప్రాంతం నుంచి లభించే నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా చివరి ఆయకట్టులోని దాదాపు 15 వేల ఎకరాలకు సాగునీటి భరోసా కల్పించడం ప్రాజెక్టు లక్ష్యమని పేర్కొన్నారు. సర్‌ప్లస్ వీర్, హెడ్ స్లూయిస్‌లతో సహా ప్రధాన నిర్మాణాలు దాదాపుగా పూర్తయ్యాయని తెలిపారు. బండ్-2లో కొంత భాగం అటవీ భూమిలో ఉండటంతో మిగిలిన పనులు అటవీ అనుమతుల కోసం ఎదురుచూస్తున్నా యని చెప్పారు. సాంకేతికంగా ఉన్న సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి వెంటనే ప్రాజెక్టును వాడుకలో తీసుకు రావాలని అధికారులకు మంత్రి ఉత్తమ్ సూచించారు. సమీక్షలో కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల కలెక్టర్లతో పాటు ఇంజినీర్-ఇన్-చీఫ్ ఓవి. రమేష్‌బాబు, నీటిపారుదల శాఖ జాయింట్ సెక్రెటరీ కె. శ్రీనివాస్ పాల్గొన్నారు.

# క్షుద్ర రాజకీయాలు కాంగ్రెస్‌కే చెల్లు

(మొదటి పేజీ తరువాయి)

తమకు లేదని వెల్లడించారు. అధికారంలో ఉన్నా లేకున్నా తెలంగాణ బాగుండాలని కోరుకుంటాం. కాంగ్రెస్ లాగా పార్టీ క్షుద్ర రాజకీయాలు మాకు తెలియదని పేర్కొన్నారు. హరీష్ రావు గుడికి పోతే తప్పా? ఇలాంటి చిల్లర రాజకీయాలు చేయవచ్చా? కాంగ్రెస్ పార్టీలాగా మేడిగడ్డకు, చెక్ డ్యామ్‌లోనూ ధ్వంసం చేసి ఓట్లు దండుకోవాలని చూడలేదని ఆరోపించారు. నీళ్లు ఉన్నా కూడా రైతులను ఎండబెట్టే కాంగ్రెస్ సంస్కృతి బీఆర్ఎస్‌ది కాదని అన్నారు. కరెంటు ఉండి కూడా వ్యవసాయదారుడికి 24 గంటల కరెంట్ ఇవ్వడం లేదు. ఏ సబ్ స్టేషన్‌కైనా రావడానికి మేము సిద్ధం. 24 గంటల కరెంట్ వస్తే ఇంకా ఎక్కడ ఉందో చెప్పాలి. కనీసం ఐదు, ఆరు సార్లు ప్రతిరోజూ కరెంట్ కోతలు అవుతున్నాయని విమర్శించారు. కోర్టులు చెప్పినా హైడ్రా విషయంలో రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న వైఖరిని ప్రజాస్వామిక వాదులు గుర్తించాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. రేవంత్ రెడ్డి ప్రజా వ్యతిరేక, రాజ్యాంగ వ్యతిరేక ఆలోచనా విధానాన్ని గుర్తించాలని, రేవంత్ రెడ్డి హిట్లర్ అని చెప్పుకున్నట్లే రాజ్యాంగ వ్యవస్థలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రెండున్నర లక్షల మందికి 58 జీవో ద్వారా పట్టాలు ఇచ్చామని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఒక్క పట్టా అయినా ఇవ్వలేదని, పైగా వేలాది మంది ఇళ్లను కూలగొట్టిందని ఆరోపించారు. హైదరాబాద్ లోని 10,000 ఎకరాల విలువైన భూమి పారిశ్రామిక భూముల విషయంలో రేవంత్ రెడ్డి చేస్తున్న 5 లక్షల కోట్ల స్కామ్ పైన రాష్ట్ర ప్రజలను జాగృతం చేస్తామని కేటీఆర్ వెల్లడించారు. హిల్ట్ పాలసీ ద్వారా రాష్ట్ర ప్రజల సొమ్మును ఏ విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం జేబులో వేసుకుంటుందో ప్రజలందరికీ అర్థమయ్యేలా లేఖల రూపంలో, ప్రజెంటేషన్ ల రూపంలో ప్రజల ముందు ఉంచుతామన్నారు. రైతులపై రేవంత్‌రెడ్డికి కనీస పరిజ్ఞానం లేదని తెలిపారు. తాము డిమాండ్ చేస్తేగానీ పంప్‌లు ఎందుకు ఆన్ చేయలేదని ప్రశ్నించారు. సీఎంకు ఎప్పుడు నీళ్లు ఎత్తిపోయాలో కూడా తెలియదని విమర్శించారు. హరీశ్‌రావు ఈ విషయంపై ప్రశ్నించినా కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు స్పందించలేదని నిలదీశారు. సీఎం రేవంత్ దృష్టిలో భూమి అంటే రియల్ ఎస్టేట్ అని ఎద్దేవా చేశారు.కేంద్రమైనా, రాష్ట్రమైనా నష్టం కలిగించేలా వ్యవహరిస్తే తిరుగుబాటు తప్పదని కేటీఆర్ హెచ్చరించారు.కేంద్ర ప్రభుత్వాన్ని అడ్డు పెట్టుకొని తెలంగాణకు నీటి వాటాల్లో అన్యాయం చేస్తే, తెలంగాణ ఉద్యమానికి మించి మరొక ఆందోళన తెలంగాణలో వస్తుందని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని నందినగర్‌లో మీడియాతో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. వచ్చేవారం జరిగే జీఆర్ఎంబీ సమావేశం ఎజెండా ఎందుకు అంగీకరించారో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశం ఎజెండా పూర్తిగా తెలంగాణ హక్కులను కాల రాస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ హక్కులను ఏ విధంగా కాపాడతారో రేవంత్, ఉత్తమ్ కుమార్ రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. తెలంగాణ వ్యతిరేకి ఆదిత్యనాథ్ దాస్ ని సలహాదారుగా పెట్టుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన సిగ్గుమాలిన చర్య అని విమర్శించారు. తెలంగాణలో ఒక్క ఇంజనీర్ కూడా లేరా? ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చెప్పుచేతల్లోకి తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తుంది. చంద్రబాబు చెప్పు చేతల్లో రేవంత్ రెడ్డి నడుస్తున్నాడు. రేవంత్ రెడ్డికి సిగ్గుంటే ఆదిత్యనాథ్ దాస్ ని తొలగించాలని డిమాండ్ చేశారు. నీళ్లు, నిధులు, నియామకాలతో కొట్లాడిన తెలంగాణలో మరోసారి నీళ్ల దోపిడీకి తెలంగాణ గురవుతున్నదని, ఇదే జరిగితే కచ్చితంగా బీఆర్ఎస్ మరోసారి నీళ్ల కోసం ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి సిగ్గు ఉంటే ఈ సమావేశాన్ని బహిష్కరించాలని సూచించారు. నార్లాపూర్‌ను ముట్టడించి పంపులను ఆన్ చేస్తామని బీఆర్ఎస్ హెచ్చరికలకు ప్రభుత్వం దిగివచ్చి పంపులని ఆన్ చేసిందని వెల్లడించారు. పాలమూరు బిడ్డ అని చెప్పుకునే రేవంత్ రెడ్డికి పాలమూరు నీళ్లు ఇచ్చే సోయి లేదు. వర్షాలు పడి పక్క రాష్ట్రం నీళ్లు ఎత్తి పోసుకుంటే ముఖ్యమంత్రికి పట్టింపు లేదు. ప్రధాన ప్రతిపక్షం ముళ్లు కట్టెతో పొడిస్తేనే ఈ ప్రభుత్వం స్పందిస్తుంది లేదంటే నిద్రపోతున్నదని పేర్కొన్నారు.

# నిరుద్యోగులంటే ఎందుకింత కక్ష

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగాలు కల్పించడంలో విఫలమైన మీ ప్రభుత్వం తప్పా అని అన్నారు. ఇంజినీరింగ్ చదివిన విద్యార్థులను ముఖ్యమంత్రి స్థాయిలో 'క్రిమినల్ వేస్ట్' అని అవమానించడం, ఉద్యోగాల కోసం వచ్చిన నిరుద్యోగులను అధికారులు దుర్భాషలాడటం చూస్తుంటే 'యథా రాజా.. తథా అధికారులు' అన్న సామెత గుర్తు కొస్తోంది. అధికారుల నోటివెంట ఇలాంటి మాటలు రావడం మరింత బాధాకరం. ఉద్యోగం కోసం వచ్చిన యువతను గౌరవంగా చూడాల్సిన అధికారులు వారినే అవమానిస్తే ఇక ఈ ప్రభుత్వం ఎవరి కోసం పనిచేస్తున్నట్టు అని అన్నారు. రెండు లక్షల ఉద్యోగాలు నిజంగా భర్తీ చేసి ఉంటే.. ఈరోజు 150 డ్రైవర్ పోస్టుల కోసం వేలాది మంది నిరుద్యోగులు ఇలా క్యూలలో నిలబడాల్సిన పరిస్థితి వచ్చేదా అని అన్నారు. నీ రెండు లక్షల ఉద్యోగాల హామీ బోగస్. నీ జాబ్ క్యాలెండర్ బోగస్. నిరుద్యోగులకు నువ్వు ఇచ్చిన హామీలు బోగస్. మీ పాలనలో ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న యువతలో నిరాశ పెరుగుతోంది. నోటిఫికేషన్లు సక్రమంగా రాకపోవడం తో పీజీ, పీహెచ్డీ వంటి ఉన్నత విద్య చదివిన యువత కూడా చిన్నచిన్న పోస్టుల కోసం పోటీ పడాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం.

# ఇకనుంచి స్మార్ట్ రేషన్ కార్డులు

- 15 ఆగస్ట్‌న ప్రారంభించనున్న సిఎం

**నిజామాబాద్,ఆగస్టు 08 :**రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి జిల్లా పౌర సరఫరాల శాఖ సన్నద్ధమవుతోంది. స్మార్ట్ కార్డు విషయంలో దాదాపు 8 నెలల నుంచి ప్రభుత్వం చేసిన ఆలోచన ఎట్టకేలకు కార్యరూపం దాల్చనుంది. ఆగస్ట్ 15న సంగారెడ్డిలో సిఎం వీటిని ప్రారంభిస్తారు. ఈ స్మార్ట్ కార్డులతో బోగస్ కార్డుల ఎత్తివేత సులువవుతందని భావిస్తున్నారు. జిల్లాల వారిగా స్మార్ట్ కార్డు పంపిణీ అంశంపై శ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పౌర సర ఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర పౌరసరఫరాల శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని ఆగస్టు 15 నుంచి స్మార్ట్ కార్డులను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఆ రోజున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంగారెడ్డి జిల్లాలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభిస్తారు. అదేరోజున మిగతా జిల్లాల్లో కూడా ప్రజా ప్రతినిధులు కార్డుల పంపిణీని లాంఛనంగా చేపడతారు. అయితే పంపిణీ వేదికలు, ఏర్పాట్లు తదితర అంశాలపై ఈనెల 11 వరకు స్పష్టత రానుంది. స్మార్ట్ రేషన్ కార్డు ఆకర్షణీయంగా ఉండనుంది. డ్రైవింగ్ లైసెన్స్, క్రెడిట్, డెబిట్ కార్డు సైజులో ఈజీగా వాలెట్‌లో పెట్టుకు నేలా ప్రభుత్వం రూపొందించింది. ఆధునిక సాంకేతిక విలువాలతో కార్డు ఆకర్షణీయంగా ఉంటుందని అధికా రులు అంటున్నారు. కొత్త కార్డుల దరఖాస్తు నిరంతర పక్రియ కావడంతో కార్డుల సంఖ్య పెరుగుతూనే ఉంటుంది. నిజామాబాద్ జిల్లాలో ప్రస్తుతం ఉన్న కార్డుల స్థానే కొత్త కార్డులను అందిస్తారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లా అధికారులు జాబితాను సిద్ధం చేశారు.

# నేడు,రేపు హైదరాబాద్ బోనాలు

(మొదటి పేజీ తరువాయి)

నేపథ్యంలో పాతబస్తీలో ఆగస్టు 9వ తేదీన ఉదయం 6 గంటల నుంచి, 10వ తేదీన ఉదయం 9 గంటల నుంచి ఊరేగింపు ముగిసే వరకు ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని వెల్లడించారు. మదీనా ఎక్స్ రోడ్డు నుంచి ఇంజిన్ బౌలి (చార్మినార్, నాగుల్ చింతా మీదుగా) రహదారి బోనాల ఊరేగింపు పూర్తయ్యే వరకు పూర్తిస్థాయిలో ఈ రోడ్డును మూసివేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు వివరించారు. ఆర్టీసీ బస్సులు, భారీ వాహనాలకు చార్మినార్, ఫలక్‌నుమా వైపు నో ఎంట్రీ ఉంటుందని తెలిపారు. వాహనదారులను ప్రత్యామ్నాయ మార్గాల్లోకి మళ్లించినట్లు వెల్లడించారు. కార్వాన్ దర్బార్ మైసమ్మ బోనాల సందర్భంగా ఆగస్టు 8వ తేదీ రాత్రి 9 గంటల నుంచి ఆగస్టు 10వ తేదీ ఉదయం వరకు పురానాపూల్, జియాగూడ, టప్పాచబుత్రా పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు పేర్కొన్నారు. అంబర్‌పేట్ మహంకాళి ఆలయం వద్ద ఆగస్టు 9వ తేదీ ఉదయం 6 గంటల నుంచి ఆగస్టు 10వ తేదీ మధ్యాహ్నం 12గంటల వరకు మళ్లింపులు ఉంటాయని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. బస్సులు, భారీ వాహనాలు అంబర్‌పేట్ ÷÷-లఓల్ల÷వర్ మీదుగా వెళ్లాలని సూచించారు. చిలకలగూడ కట్ట మైసమ్మ ఆలయం వద్ద ఆగస్టు 9, 10వ తేదీల్లో ఉదయం 5 గంటల నుంచి రాత్రి 11గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని వెల్లడించారు. సీతాఫల్‌మండి, పద్మారావు నగర్ వైపు వాహనాలను మళ్లిస్తున్నట్లు చెప్పారు. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని ట్రాఫిక్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.


# ఎల్‌నినోతో సాగునీటికి కష్టాలు

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఒకవేళ నాగార్జునసాగర్ నిండినప్పటికీ చెరువులు నింపే పరిస్థితి లేదని, ఇప్పటికే బోర్లలో కూడా గ్రౌండ్ వాటర్ తగ్గిపోతున్నందున కష్టకాలంలో అధికారులు, ప్రజాప్రతినిధులు రైతులకు అండగా నిలబడి ఆరుతడి పంటలు వేసుకునేలా చూడాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. శనివారం నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ.. ప్రస్తుతం నాగార్జునసాగర్ ప్రాజెక్టులో నీరు డెడ్‌స్టోరేజీలో ఉందని, శ్రీశైలం నుంచి నీరు వచ్చినప్పటికీ పంటలకు సాగునీరు ఇచ్చే పరిస్థితి లేదని, ఉన్న నీరు జూన్ 2027 వరకు తాగునీటికే సరిపోతుందని తెలిపారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలని కోరారు. ఏఎంఆర్‌పీ కూడా సగమే నిండిందని, గతంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి లేదని మంత్రి అన్నారు.కరువు వచ్చినప్పటికీ నల్గొండ జిల్లాకు శాశ్వతంగా సాగునీరు అందించే ఎస్‌ఎల్‌బీసీ సొరంగం పనులు ఆగస్టు 2028 నాటికి పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. పనులు కొనసాగుతున్నాయని, ఏఎంఆర్‌పీ, ఎస్‌ఎల్‌బీసీ, బ్రాహ్మణ వె÷-లలెంల ద్వారా జిల్లాలో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని అన్నారు. ఎస్‌ఎల్‌బీసీ కోసం ఎంతైనా ఖర్చు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశించారని తెలిపారు. కరువు వచ్చినా, శ్రీశైలం డెడ్‌స్టోరేజీలో ఉన్నప్పటికీ ఎస్‌ఎల్‌బీసీ నుంచి సాగునీరు అందించవచ్చున్నారు. రాబోయే రోజుల్లో సూపర్ ఎల్‌నినో కారణంగా దక్షిణ తెలంగాణలో పరిస్థితులు ఎలా ఉంటాయో తెలియని పరిస్థితి నెలకొందని తెలిపారు. అందువల్ల అధికారులు, ప్రజాప్రతినిధులు రైతులు ఆరుతడి పంటలు వేసుకునేలా కష్టపడి పనిచేయాలని, ఇలాంటి కరువు పరిస్థితుల్లో రైతులకు అందరూ అండగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో పంట మార్పిడిలో భాగంగా 33 వేల ఎకరాల్లో వరికి బదులు ఆరుతడి పంటలు వేయడం జరిగిందని మంత్రి తెలిపారు. అయితే దీన్ని లక్షన్నర ఎకరాల లక్ష్యంగా తీసుకుని రైతులతో ఆరుతడి పంటలు వేయించాలని ఆదేశించారు. జిల్లాలో 9 వేల ట్రాన్స్‌ఫార్మర్లపై ఉన్న ఓవర్‌లోడ్‌ను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడి అవసరమైన విద్యుత్ సామగ్రిని తెప్పిస్తామన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి కష్టకాలంలో రైతులకు అండగా ఉండాలని, ప్రజలకు ధైర్యం చెప్పాలని, ఆరుతడి పంటలు వేసుకునే విధంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఇకపై జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశాలను నిరంతరం నిర్వహించాలని సూచించారు.

# హైడ్రాలో 150 డ్రైవర్ ఉద్యోగాలు

- వేలదిగా తరలివచ్చిన నిరుద్యోగులు
- సరూర్ నగర్ స్టేడియంలో తోపులాట




**హైదరాబాద్,ఆగస్టు 08 :** నగరంలోని సరూర్‌నగర్ స్టేడియం వద్ద తోపులాట జరిగింది. హైడ్రాలో 150 డ్రైవర్ ఉద్యోగాల కోసం నిరుద్యోగులు పోటెత్తారు. శనివారం, ఆదివారం డ్రైవర్ల ఎంపిక ఉంటుందని హైడ్రా ప్రకటించింది. దీంతో ఇందులో పాల్గొనేందుకు నిరుద్యోగులు భారీగా తరలిరావడంతో తోపులాట జరిగింది. ఇటీవల హైడ్రా విడుదల చేసిన 150 డ్రైవర్ పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన రిక్రూట్‌మెంట్ పక్రియ తీవ్ర గందరగోళానికి దారి తీసింది. డ్రైవర్ పోస్ట్‌ల కోసం రాష్ట్రంలోని నలుమూల నుంచి వేలాది మంది నిరుద్యోగ యువత శనివారం తెల్లవారుజామున 4 గంటల నుంచే భారీగా సరూర్‌నగర్ స్టేడియానికి చేరుకున్నారు. కేవలం 150 పోస్టులు ఉండగా.. ఊహించిన రీతిలో వేలాది మంది పోటెత్తడంతో స్టేడియం మొత్తం నిరుద్యోగులతో కిక్కిరిసిపోయింది. ఈ క్రమంలో కొంత ఉద్రిక్తత, తోపులాట చోటుచేసుకుంది. గంటల తరబడి లైన్లలో వేచి ఉన్నప్పటికీ అధికారుల వైపు నుంచి సరైన ఏర్పాట్లు లేకపోవడంతో నిరుద్యోగులు అసహనం వ్యక్తం చేశారు. కనీసం తాగడానికి మంచి నీరు కూడా ఏర్పాటు చేయకపోవడంతో లైన్లలో వేచి ఉన్న యువత.. నిర్వాహకుల తీరుపై ఆందోళనకు దిగారు. ఉద్యోగం కోసం జిల్లాలు దాటి వస్తే అధికారులు నిర్లక్ష్యంగా ప్రవర్తించారంటూ నిరుద్యోగులు వాపోతున్నారు. వెంటనే స్థానిక పోలీసులు అక్కడకు చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ప్రస్తుతం అభ్యర్థులకు టోకెన్ ఇచ్చి వెనక్కి పంపిస్తున్నట్లు తెలుస్తోంది. టోకెన్‌లో చెప్పిన టైమ్ ప్రకారం అక్కడకు వచ్చి ఈవెంట్స్‌లో

# నీలగిరి - సాహితీ సంగమం -17

## మెతుకు విలువ

జీవించి ఉండటానికి కారణం
జీవితానికి మూలాధారం,
కచ్చితంగా కావలెను ఆహారం
అదే కడుపు నింపే ప్రాణాధారం!
ఆకలి అనే ఆక్రందన
వినిపించును ప్రతి నోట,
ఆ ఆకలి తీరును నిశ్చయముగా
రైతన్న పొలంలో ఉన్నచోట!
కష్టపడి పంటను పండించే దాత
మన అందరి ప్రాణదాత... అన్నదాత!
ఉన్నోడికైనా, లేనోడికైనా
ఆరాటమంతా ఆ కూటికేగా!
మెతుకు విలువ తెలిసొస్తుంది
కడుపులో పేగులు మాడినప్పుడు!
రైతు విలువ తెలిసొస్తుంది
తినడానికి తిండి దొరకనప్పుడు!
రైతన్నను కాపాడుకోవడం
మనందరి ప్రాథమిక బాధ్యత!
అన్నాన్ని వృథా చేయకు సోదరా...
మార్మోగే ఆ ఆకలి కేకలను గుర్తుంచుకోరా!

గాధం అరుణ్ కుమార్ బి.టెక్. మూడవ సంవత్సరం వరంగల్.

## దూరదర్శన్

సీ.
ప్రాభాత సమయాన భగవంతు
కీర్తనల్
జనులకు వినిపించు జైత్రవాణి
దేశవిదేశాల దీపించు వార్తల
అనుదినమందించు నాప్తవాణి
చలనచిత్రములను చక్కగా జూపించి
సద్వినోదము పంచు సరసవాణి
ఆధ్యాత్మ వచనాల నాదరతను పంచు
విజ్ఞాన సందీప్త విపుల వాణి
తే.గీ.
వివిధ మాధ్యమ ములనుండి
విస్తరించి
జ్ఞాన విజ్ఞాన కాంతుల సందడించి
మానవాళికి గృహమందు మాన్యమైన
దూర దర్శను మనకిడు
తోషములను.

డా.వేదాల.గాయత్రీదేవి
హైదరాబాద్.

## చాటువులు

కం
మొదలున నాత్మ శుచి వలయు
తదుపరి పర సంస్కరణము
తపనయు వలయున్
మదినింద కల్మషమయిన
నది యెప్పటికిని సఫలత నందదు
భువిలో
కం
మంచికి చెడుకున్ భేదము
కొంచెము గమనించి చేయ కుశలత
గల్గున్
నంచిత మదియే మనకును
నించుక సద్భావన కలిగించు
జనులకున్
కం
మంచి తనంబున మారక
నెంచుచు చేయరె పలుచన నితరుల
కదియే యంచిత మని భావింతురు
కించన పడినపుడె తెలియు ఖేదపు
బాధన్

సత్యనారాయణ బొలిశెట్టి,
హైదరాబాద్

## భద్రాచల మాహాత్మ్యము

సీసం:
నవ వసంతమ్మిట నాట్యమాడుచు
యుండె
వైదేహి తానుండ వనము లోన!
మలయ మారుతములు
మంద్రముగా వీచె
మరువంపు సొగసులు మంచి గాను!
సన్న జాజులు పూచె సంపెంగ
విరబూసె
పొన్నలూ పొగడలూ పొందుగోరి!
ప్రకృతి కాంతయు తాను
పరవశించిన దోయి
పర్ణశాలను జూడ పడతి యుండ!

ఆ. వె:
అసుర వీరుడేమొ అబల నెత్తుకు
పోగ
ఆగమయ్యి పోయె నవని యంత!
ఇట్టి నీచ కర్మ ఈ నేల జరిగెను
భద్రగిరి నివాస భవ్య చరిత!!

ఎర్రన, తుంగతుర్తి

## ఆషాఢ మాస బోనాలసందర్భముగా :

తే.గీ.
అంబ! యాషాఢ మందున యవని
పైన
మా కొలుపు లందు కొనుచును
మమ్ము గాచి
కోరికను దీర్చ రావమ్మ కూర్మి తోడ
కొంగు జాచి గోరుదు తల్లి కోమ
లాంగి!
బోన మెత్తి కొలచితిమి భోగ
మొలదు,
చీర, సారెల నిడమని గోర మెపుడు,
సిరులు, సంపద లడగము చిద్వి
లాసి!
చల్లగా చూడుము మమ్ముల తల్లి
దుర్గ!
పోతు రాజాటలకు తల్లి పొందు
తృప్తి,
గజ్జె సవ్వళ్ళు వినుచును కరుణ
జూపు,
డప్పు మ్రోతల కాచు మా తప్పు
లెపుడు,
భక్తిగా మే మిడుదు నీకు
వందనములు!

వసుమతీ జగన్నాథం.
హైదరాబాద్.

## “కలియుగము”

సీ.:
అతి మూల్యమైనదై గతిలేని
సమయము,
గడిచిపోవు జనుల కలియుగమున,
పలుకు బంగరమౌను, బంధువు
లొలయుట
కరువౌను జాడ్యమై కలియుగమున,
డబ్బుకున్న విలువ లబ్బల కొసగని
కన్నవా రైపోవు కలియుగమున,
రాజులు లోభులై రాజ్యమేలుచు
నుండు
కసికోత ప్రజలదౌ కలియుగమున.
ఆ.వె.
మనిషి మనిషి మధ్య మాన్యత
ధనమయి,
కట్టు బంధములను కలియుగమున,
నాధునికత యనుచు నాత్మ నమ్ము
కొనుట
కలిసిరాని కృతమె కలియుగమున.

వేగరాజు సాయి వర ప్రసాద్,
హైదరాబాదు

## అక్షర సేద్యము

కం
అక్షర సేద్యము జేసిన
కుక్షిన్నింపంగ వచ్చు కోరిక మీరన్
అక్షర సాధన మరచిన
భిక్షాటన చేయవచ్చు వీధిని కృష్ణా!!
కం
శిష్యరికమ్మును జేసియు
భాష్యాచారుండవంగ భాగ్యము చేతన్
శిష్యులకున్ బోధించగ
శిష్యుడు గురువయ్యె గురులు
శిష్యుంద్రగుటన్!!
కం
గురువును మించిన శిష్యుడు
గురుతర బాధ్యత నెరిగిన
గుణమును జూపన్
గురువును ముంచిన శిష్యుడు
నరకుని వలె బాధపెట్టు నమ్ముర
కృష్ణా!!

గడ్డం కృష్ణారెడ్డి రేపాల సూర్యాపేట!!

## స్వచ్ఛ భారతము

ఆ.వె.
జనులు కోరుకొనగ స్వచ్ఛ భారత
మును
వీధు లందు చెత్త వేయ కెపుడు
పారిశుధ్యపు పని వారి కొసగినంత
పరిసరమ్ములన్ని బాగుపడును...

ఆ.వె.
పరులదని తలచక పరిసర శుభ్రత
మనిషి బాధ్యతలను మరువకుండ
జనులు స్వచ్ఛ భారతమను జరిపి
నంత
భరతమాత మహిని భాసురమగు॥

ఆ.వె.
ప్రజలు దారులందు పారవేయుచు
చెత్త రక్ష కోరు చున్న లాభ మేమి
శుభ్రపరచు కొనిన చూడ చక్కనిదిగ
వద్ద చేరదెపుడు ప్రాణ భయము

మరింగంటి శ్రీనివాస్ హైదరాబాద్

## అక్షర యజ్ఞంబిబాల పంచపదులు

అక్షరమైనది అక్షరయజ్ఞము
మహిమాన్విత మహాయజ్ఞము
అజ్ఞానం తొలగించే దివ్యయజ్ఞము
మూర్ఖుని జ్ఞానిగా మార్చే యజ్ఞము
తరగని సిరి ఈ జ్ఞన యజ్ఞం!

కన్న తల్లి ఒళ్ళో శ్రీకారమయ్యేది
నాన్నచే ఇంట్లో సాకారమ్మయ్యేది
గురువుచే బళ్లో తీర్చిదద్దబడేది
గుళ్ళో దైవంచే దీవించబడేది
బతుకుబాట చూపే యజ్ఞము!

అక్షర కూడికతో పదమవును
పదాలు కలిస్తే ఓ పాదమవును
పాదాల కూర్పుతో పద్యమవును
పద్యాల పేర్పుతో కావ్యమవును
కవి చేసేది కవన యజ్ఞము!

విఠల్

## కలిస్తేనే...

ఆత్మీయుల పలకరింపులో మాధుర్యం
ఆలింగనం చేసుకొనే కొలదీ
అనురాగం
మనసులు ముడివేసుకుంటూ
మమకారం

నోట మాటలు కూడా రాలనంతగా
తన్మయత్వం
తొలకరి జల్లుల మధ్య తడిసిన
తనువులా నాట్యం
మరచిపోకండి తరచుగా కలిస్తేనే

బంధాలు మరింత పదిలం
తప్పొప్పుల సంకెళ్ళు తెంచితేనే ప్రేమ
కుసుమాల వికాసం

శశిశేఖర్ అల్లంకి
ఏలూరు

## ప్రకృతి కాంత

పుడమి నవ్వులు పువ్వులు గాను
హరిత ప్రకృతి హర్షము నివ్వగా
పచ్చని చేలు విచ్చి తలలూప
నచ్చిన మదియే నాట్యము లాడే

తడిసిన వసుధ తనువును మరచి
వింత వాసనలా వీవనలాయె
చెంత నిలిచేనూ వింత సోయగముల
ప్రకృతి కాంతా పలుకరించేను

విరులు విరిసెను వీధులలోను
వాకిళ్ళు మెరిసిన రంగవల్లులై
మగువ మురిసిన ముంగిళ్లలోను
జగము కదిలెను జాగృతముగను

పి, శర్వాణి

## మంచిమాట

ఆ.వె
మంచి మాటలాడు మంచితనము
బంచు
స్వచ్ఛమైన మాట స్వర్గసమము
మంచిమాటయిచ్చు మనసుకు
శాంతిని
లక్షణమగు బాట లక్ష్మి మాట

ఆ.వె
స్వచ్ఛమైన ప్రేమ స్వర్గంబునేమించు
ధనము కన్న మిన్న గుణము జూడ
మనసు శాంతియుండ మందులు
వలదోయి
లక్షణమగు బాట లక్ష్మి మాట

ఆ.వె
ప్రేమ పలుకులిచ్చు పెన్నిధి
సతతము
స్వచ్ఛమైన పలుకు శక్తినిచ్చు
మనసు సేదదీరు మంచి మాట
వలనలక్షణమగు బాట లక్ష్మి మాట

వరలక్ష్మి యనమండ్ర
హైదరాబాద్

## స్నేహితుడు.(రుబాయిలు )

బాధలందు భయము నందు
ధైర్యమిడును మిత్రుడనగ
కష్ట సుఖములందు నిలచి
సాయపడును మిత్రుడనగ
ఒక్కడున్న చాలు సతము జీవితమ్ము
పూలబాట
పరమ పథము నందుకొనెడి
జ్ఞానమిడును మిత్రుడనగ//
దోషములను సరిదిద్దెడి స్నేహితుడిని
విడువకోయి!
నీతి కల్గి మెల్గుచుండు సజ్జనుడిని
విడువకోయి!
తత్వమెఱిగి జీవించెడి సుహృత్తుడే
మనికి నిల్పు
పరుల మేలు కోరుచుండు
పావనుడిని విడువకోయి!//
మంచి చెడులు నిర్ణయించు
మిత్రునితో చెలిమి చేయి!
ధనము మీద నాశలేని నేస్తునితో
చెలిమిచేయి!
నిందవేసి గేలిచేయు హీనమతిని
విడచి పెట్టి
సత్వనిధిగ చరియించెడి ధీమణితో
చెలిమిచేయి!//

టి. వి. యెల్. గాయత్రి.
పూణే. మహారాష్ట్ర.

## నారసింహావతారము

ఉ.
ఘాతకచర్య దైత్యుడు వికార
గుణంబుహిరణ్యకశ్యపుడున్
పాతకముల్లొనర్చు నిల భారముగా
వెలుగొందుదైత్యునిన్
భూతలమందు శాంతికయి పోరగ
సన్నధుడయ్యె శ్రీహరిన్
భీతిని గొల్ప కంబమున భీకర
రూపమునుండె నోర్వుగన్
ఉ.
శ్రీహరి నారసింహుడుగ క్షేమమొనర్ప
ధరాస్థలిన్ వడిన్
మోహమధాంధునిన్ దునుమ
మూరితినుగ్రరూపుడై
బాహువులెత్తి దూకెనట నపార
బలాఢ్యుడు భక్తకోటికై
దేహము,కుక్షి చీల్చగ సుధీర్ఘపు
శ్వాసను దీసె దిత్యుడున్

తే.గీ.
స్తుతిని జేసెప్రహ్లాదుడా పతినిజేరి
శాంతినొందగ శ్రీ హరి కాంతిలొల్కు
రాజ్యసంపద లీయగ రాగమలర
దేవతాళిని దీవించె దేవవిభుడు.

మాతా గంగాభవాని
శాంకరీ దేవి,

## సలలితం(అచల వృత్తము)..

తలపుల నిలుచును
తలచిన మెరియును
వలపులు కురియును
వలచిన మురియును...!!!

పలుకులు విసరగ
అలకల మురిపెము
మలుపులుతిరుగును
కలహపు ప్రణయము..!!!

పిలుపులు విరియగ
కలిసెను పెదవులు
తెలిపెను మధురిమ
కలిసెను కనుగవ...!!!

మలుపులునెదురవు
కలతలు కలుగును
కలలుగ మరచిన
వెలుగును వలపులు..!!!

గవిచర్ల వెంకట దుర్గా
ప్రసాద్ శాస్త్రి..

## శ్రీ రామ స్తుతి

**ఉత్సాహ వేదండ వృత్తము**

రామనామ మహిమ తెలియ
రామదండు కోరగన్

రామశక్తి దెల్పి మహికి రామ
మంత్రమీయుచున్

రాముడంత రావణుణ్ణి
రణమునందు గూల్చగన్

రామ రామ యనుచు సురలు రమ్య
ముగను గొల్చిరే!

తేటగీతి.

రామునకు సాటి లేరిల రమ్య
ముగను
రాఘవాయని పిల్వగ లక్షణ ముగ
చేరి మనలను గాచును క్షేమ మరసి
రామరక్షను వరమును
రాముడొసగు.

పేరి భార్గవి.
విశాఖ పట్నం.

## తొలివలపు!

**తెలుగు గజల్:**

కళ్ళముందు ఇంద్రధనసు మెరిసినట్టు
ఉందేమిటి?
విరిమల్లెలు జల్లులుగా కురిసినట్టు
ఉందేమిటి!

తలను తిప్పి కళ్ళుకలిపి చిరునవ్వును
విసిరేస్తే,
ఆ స్వర్గం నా చేతికి అందినట్టు
ఉందేమిటి?

ఏ క్షణ మే రీతి నుండు నీ చిత్తము
నెరుగవశమ?
కంటి ఎరుపు నా ఊపిరి నాపినట్లు
ఉందేమిటి?
ఎటు చూసిన నీరూపే నిలువెల్లా
నిండినావు!
నీ తోటే ప్రతి నిముషం గడిపినట్లు
ఉందేమిటి!
నచ్చిన చెలితో కుసుమా జీవితము
విహారయాత్ర!
మనసు హాయి వెల్లువలో పొర్లినట్లు
ఉందేమిటి!

కుసుమఉప్పలపాటి
హైదరాబాద్.

## ఫారెస్ట్ అధికారుల ఆంక్షలపై పోడు రైతుల ధర్నా



ఖానాపూర్, ఆగస్టు 08 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): పోడు రైతుల భూముల్లో ట్రాక్టర్లు వాడరాదని ఫారెస్ట్ అధికారులు చేస్తున్న హెచ్చరికలను వెనక్కి తీసుకోవాలని, టైగర్ జోన్ ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా ఆధ్వర్యంలో ఖానాపూర్‌లో ధర్నా జరిగింది. ఎన్టీఆర్ చౌక్ నుండి ఫారెస్ట్ ఎఫ్డీఓ కార్యాలయం వరకు ప్రదర్శనగా వెళ్లి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి నంది రామయ్య మాట్లాడుతూ, దశాబ్దాలుగా పోడు సాగు చేస్తున్న రైతులను బెదిరించడం అన్యాయమని, ట్రాక్టర్ల వాడకాన్ని నిషేధించడం దుర్మార్గమని అన్నారు. వ్యవసాయ రంగంలో మారిన పరిస్థితులను అర్థం చేసుకుని యంత్రాల వాడకాన్ని అనుమతించాలని డిమాండ్ చేశారు. ఉడుంపూర్, ఇందనపల్లి ఘటనల్లో ఫారెస్ట్ అధికారులు వ్యవహరించిన తీరును తీవ్రంగా ఖండించారు. టైగర్ జోన్ పేరుతో ఆదివాసులను అడవిలోకి వెళ్లకుండా నిరోధించడం సరికాదని, ఇది ఆదివాసి చట్టాలను ఉల్లంఘించడం అవుతుందని పేర్కొన్నారు. వెంటనే టైగర్ జోన్ ఎత్తివేయాలని, లేకపోతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని, అవసరమైతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు జక్కుల రాజన్న, నూనె నర్సింగరావు, అడగట్ల శంకర్, అభి యాదవ్, పెందూరు మోహన్, మచ్చ మనోహర్, మచ్చ శ్రీనివాస్, పూసం లక్ష్మణ్, జైతు, చిట్యాల ఎర్రన్న, కామెర రాజన్న, శేంబు, గోరె భాయ్, వర్మ, భూమేష్, శేఖర్, లాలు, దేవరావు తదితరులు పాల్గొన్నారు.

## సెంట్రల్ లైటింగ్ సమస్య పరిష్కారం



ఖానాపూర్, ఆగస్టు 08 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : ఖానాపూర్ పట్టణంలోని కొమరం భీం చౌరస్తా వద్ద సెంట్రల్ లైటింగ్ గత మూడు రోజులుగా పనిచేయక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యను మున్సిపల్ చైర్మన్ అంకం మౌనిక మహేందర్ మున్సిపాలిటీ విద్యుత్ సిబ్బందితో కలిసి పరిశీలించి మరమ్మతులు చేయించారు. అవసరమైన సామాగ్రి అందుబాటులో లేకపోవడంతో సంబంధిత ఆర్ఎండి రోడ్డు అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. అధికారులు రెండు రోజుల్లో విద్యుత్ సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముహమ్మద్ షోయబ్ హుస్సేన్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటిన విద్యార్థులు



ఖానాపూర్, ఆగస్టు 08 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి విద్యార్థి తమ కుటుంబ సభ్యుల పేరుతో ఒక మొక్కను నాటాలని సూచిస్తూ లింగాపూర్ ఉన్నత పాఠశాల ఆవరణలో నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో మొక్కల నాటకం జరిగింది. ఈ సందర్భంగా హెడ్‌మాస్టర్ కాలేరి భూమేశ్వర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. పాఠశాల ఎన్జిసి ఇంచార్జి టీచర్లు వాల్గోట్ కిషన్, కె. మహేష్, రాజేశ్వర్, ఫిజికల్ డైరెక్టర్ ప్రభాకర్, రాజేందర్, రమేష్, శ్రీనివాస్ మరియు ఎన్జిసి విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా పోచమ్మ బోనాల పండుగ



గంగాధర, ఆగస్టు 08 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలోని లక్ష్మీదేవిపల్లి గ్రామ నరేంద్ర విద్యాలయం హైస్కూల్‌లో పోచమ్మ బోనాల పండుగను శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ చిన్నతనం నుంచే పిల్లలకు సంస్కృతి, సాంప్రదాయాలను అలవర్చుకోవాలనే ఉద్దేశంతో ఈ వేడుకలు నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థినులు సాంప్రదాయ దుస్తులు ధరించి భక్తిశ్రద్ధలతో సిద్ధం చేసిన బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి పోచమ్మ తల్లికి సమర్పించారు. విద్యార్థులు వేసిన పోతారాజుల వేషధారణలు, నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పోచమ్మ తల్లి పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు తల్లిదండ్రులు, గ్రామస్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వృద్ధురాలి ఇంట్లో దొంగతనం రెండు గంటల్లోనే పట్టుబడిన నిందితుడు



కరీంనగర్, ఆగస్టు 08 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ 27వ డివిజన్ శివాజీ నగర్‌లో వృద్ధురాలు జంగం రాజమ్మ ఇంట్లోకి చొరబడి ఆమెపై దాడి చేసి ఆభరణాలు దొంగిలించిన మునుగొండ మధు అనే వ్యక్తిని పోలీసులు రెండు గంటల్లోనే పట్టుకున్నారు. ఘటన జరిగిన వెంటనే కార్పొరేటర్ బోట్ల శ్యామల, తంగేళ్ల కిరణ్ కుమార్ (టిల్లు) సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వృద్ధురాలిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందేలా చర్యలు తీసుకున్నారు. అనంతరం పోలీసులతో సమన్వయం చేసి దర్యాప్తును వేగవంతం చేయడంతో నిందితుడు పట్టుబడ్డాడు. ప్రజల భద్రత కోసం తక్షణమే స్పందించి బాధితురాలికి అండగా నిలిచిన కార్పొరేటర్ కృషి అభినందనీయం అని స్థానికులు పేర్కొన్నారు.

# అభివృద్ధి నిధులపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు




కరీంనగర్, ఆగస్టు 08 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): కరీంనగర్ అభివృద్ధి పనులు కేంద్ర నిధులతోనే జరుగుతున్నాయని బీజేపీ నేత బండి సంజయ్ ప్రచారం చేయడం వాస్తవ విరుద్ధమని సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి విమర్శించారు. శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద వచ్చిన నిధుల రుణభారం రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని, కేంద్రానికి ప్రత్యక్ష వాటా లేదని తెలిపారు. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద రూ.840 కోట్లలో రాష్ట్ర వాటా హడ్కో రుణం ఉందని, కేంద్రం మొత్తం నిధులు ఇచ్చిందని చెప్పడం తప్పుదారి పట్టించడమేనని పేర్కొన్నారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో రాష్ట్రం రూ.70 కోట్లు జమ చేసినప్పటికీ, కేంద్రం తన వాటా ఇవ్వలేదని ఆరోపించారు. ఈ అంశాలపై బండి సంజయ్‌తో బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. కరీంనగర్ అభివృద్ధిలో రాష్ట్ర ప్రభుత్వ పాత్రను విస్మరించి ప్రతి పనినీ కేంద్రం ఖాతాలో వేసుకోవడం ప్రజలను తప్పుదారి పట్టించడమేనని నరేందర్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కట్టుబడి ఉందని, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొరివి అరుణ్ కుమార్, కార్పొరేటర్లు వరాల నర్సింగం, పర్వతం మల్లేశం, జగన్ రెడ్డి, పిట్టల రవీందర్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, లాయక్, కుర్ర పోచయ్య, ఎండి చాంద్, మామిడి సత్యనారాయణ రెడ్డి, బషీర్, భారీ హనీఫ్, సాయిరాం, రమణా రెడ్డి, రాజ్ కుమార్, ఖలీల్, ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

# సాగునీటి ప్రాజెక్టులకు నిధుల వరద



కరీంనగర్, ఆగస్టు 08 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): రాష్ట్రవ్యాప్తంగా సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ, పునరావాసం, అటవీ అనుమతుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం రూ.5 వేల కోట్లు కేటాయించనుందని నీటిపారుదల మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే రూ.2 వేల కోట్లు విడుదల కాగా, మరో రూ.3 వేల కోట్లకు లైన్ క్లియర్ అయిందని వెల్లడించారు. కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ నిధుల కొరత కారణంగా ఏ ప్రాజెక్టు ఆగిపోకూడదని స్పష్టం చేశారు. భూసేకరణ, ఆర్అండ్ఆర్, అటవీ అనుమతులను అత్యంత ప్రాధాన్యతగా పరిగణించాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. సుమారు నాలుగున్నరేళ్లుగా నిలిచిపోయిన మిడ్‌మానేరు ఎడమ కాలువ పనులను వెంటనే పునఃప్రారంభించాలని సూచించారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలో ప్రతిపాదించిన పత్తిపాక రిజర్వాయర్ ద్వారా 2.40 లక్షల ఎకరాలకు ఆయకట్టు భరోసా కల్పించనున్నట్లు తెలిపారు. జగిత్యాల జిల్లా రోళ్లవాగు ప్రాజెక్టు ఇప్పటికే 96 శాతం పూర్తయిందని, మిగిలిన పనులకు అటవీ అనుమతులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రాజెక్టుల వారీగా సమస్యలు, అవసరమైన నిధులు, పరిష్కార కాలపరిమితి వివరాలతో ప్రత్యేక జాబితా రూపొందించాలని ఉత్తమ్‌కువ వార్‌రెడ్డి సూచించారు. రైతులకు నీరు అందించడంలో ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. సమీక్షలో వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఐటీ మంత్రి డి. శ్రీధర్‌బాబు, రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్, సాంఘిక సంక్షేమ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కలెక్టర్లు, నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

# హర్ ఘర్ తిరంగా యాత్రకు సన్నాహకాలు



గన్నేరువరం/శంకరపట్నం, ఆగస్టు 08 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర నాయకత్వం పిలుపు మేరకు "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమాలను విజయవంతం చేయాలని బీజేపీ మండలాల్లో సమావేశాలు నిర్వహించారు. గన్నేరువరం మండలంలో అధ్యక్షుడు తిప్పర్తి నిఖేష్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంగ నరేష్ హాజరై ప్రతి ఇంటిపై జాతీయ పతాకం ఎగురవేయాలని, కార్యక్రమంలో యువత, మహిళలు, రైతులు చురుకుగా పాల్గొని దేశభక్తిని చాటాలని పిలుపునిచ్చారు. గన్నేరువరం మండలంలో జెండా లేని ఇల్లు లేకుండా ఉండేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. శంకరపట్నం మండలంలో అధ్యక్షుడు ఏనుగుల అనిల్ ఆధ్వర్యంలో జరిగిన సన్నాహక సమావేశానికి జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి హాజరై జాతీయ జెండా ప్రతి భారతీయుడి గౌరవానికి ప్రతీక అని, అమరవీరులను స్మరించుకుంటూ ప్రతి కుటుంబం స్వచ్ఛందంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 12న కేశవపట్నంలో బైక్ ర్యాలీ, ఆగస్టు 13న ప్రతి ఇంటిపై జెండా ఆవిష్కరణ, ఆగస్టు 15న మండల కేంద్రంలో ప్రధాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశాల్లో నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమాలను ప్రజా ఉద్యమంగా మార్చి విజయవంతం చేయాలని నిర్ణయించారు.

# రవి డీలక్స్ లాడ్జిలో జూద స్థావరంపై పోలీసుల మెరుపుదాడి

**– 16 మంది జూదరుల అరెస్ట్.. రూ.1.04 లక్షల నగదు, 16 సెల్‌ఫోన్లు, ఇస్పేటు ఆకులు స్వాధీనం**






నందికొట్కూరు, ఆగస్టు 8(నీలగిరి ఎక్స్ ప్రెస్): పట్టణంలోని రవి డీలక్స్ లాడ్జిలో నిర్వహిస్తున్న అందర్--బాహర్ జూదంపై నందికొట్కూరు టౌన్ పోలీసులు శుక్రవారం సాయంత్రం ఆకస్మిక దాడి నిర్వహించి 16 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1,04,870 నగదు, 16 సెల్‌ఫోన్లు, 52 ఇస్పేటు ఆకులు, నాలుగు పూర్తి సెట్ల ఇస్పేటు ఆకులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం సాయంత్రం 4.30 గంటల సమయంలో నందికొట్కూరు పట్టణంలోని రవి డీలక్స్ లాడ్జి మూడో అంతస్తులోని రూము నెం. =-5లో అందర్--బాహర్ జూదం నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో నందికొట్కూరు టౌన్ సీఐ ఎన్. అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ ఎం. చంద్రశేఖర్, హెడ్ కానిస్టేబుల్ 1025, పోలీసు కానిస్టేబుళ్లు 968, 3613, 380తో పాటు హోంగార్డులు 993, 990లతో కలిసి సోదాలు నిర్వహించారు. దాడి సమయంలో జూదంలో పాల్గొంటున్న 16 మందిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద ఉన్న రూ.1,04,870 నగదు, 16 సెల్‌ఫోన్లు, 52 ఇస్పేటు ఆకులు, నాలుగు పూర్తి సెట్ల ఇస్పేటు ఆకులను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో షేక్ బాబులాల్, బోయ అలీ, ఈడిగ వెంకటేశ్వర్లు, రమణా రెడ్డి, బోయ రామనాయుడు, కొట్ట బూశన్న, వడ్డె వెంకటేశ్వర్లు, గువ్వల కృష్ణయ్య, జిలకర్ర ఈదన్న, బొంతల రామ్‌కుమార్ రెడ్డి, పల్లె ప్రతాప్ రెడ్డి, మండ్ల రామాంజనేయులు, బోయ రామాంజనేయులు, కొంగర వెంకటేశ్వర్లు, చందాపురం శ్రీధర్ రెడ్డి, జానుపల్లి మల్లికార్జున రెడ్డి ఉన్నారు. నిందితులపై జూద నిరోధక చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# సొసైటీ చైర్మన్లు రైతు శ్రేయస్సు కోసం అంకితభావంతో పనిచేయాలి

**– ఎమ్మెల్యే వీర్లపల్లి**





షాద్‌నగర్, ఆగస్టు 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): వ్యవసాయ సహకార సంఘాల చైర్మన్లు, పాలకవర్గ సభ్యులు రైతు శ్రేయస్సు కోసం అంకితభావంతో పనిచేయాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. శనివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించిన ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డ కార్యకర్తలకు భవిష్యత్తులో మరిన్ని అవకాశాలు ఉంటాయని తెలిపారు. షాద్‌నగర్ డివిజన్‌లో మొత్తం ఆరు సహకార సంఘాలు ఉండగా, వాటిలో ఐదు సంఘాలకు నూతన చైర్మన్లను నియమించామని ఆయన వెల్లడించారు. రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ ఎరువులు, విత్తనాలు, యంత్ర పరికరాలను సమయానికి అందించడం సహకార సంఘాల బాధ్యత అని వివరించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను బలోపేతం చేసి ఆర్థికపరంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు బిడ్డగా రైతుల కష్టాలను అర్థం చేసుకుని అనేక సంక్షేమ పథకాలను సబ్సిడీపై అందిస్తున్నారని గుర్తు చేశారు. నిజాయితీగా పనిచేసే కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అవకాశాలు కల్పిస్తుందని, పదవులు పొందిన నాయకులు ప్రజల మన్ననలు పొందేలా అంకితభావంతో పనిచేయాలని ఆయన పిలు పునిచ్చారు.

**– ఐదు సహకార సంఘాల నూతన చైర్మన్లు**

షాద్‌నగర్ నియోజకవర్గంలోని ఐదు సహకార సంఘాలకు నూతన చైర్మన్లు, పాలకవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొందరు మండల సహకార సంఘం చైర్మన్‌గా తుమ్మలపల్లి జితేందర్ రెడ్డి, చేగూరు సహకార సంఘం చైర్మన్‌గా పసుల బుచ్చయ్య, మేకగూడా సహకార సంఘం చైర్మన్‌గా అంబటి ప్రభాకర్, నందిగామ సహకార సంఘం చైర్మన్‌గా కుందారం వెంకటరెడ్డి, కేశంపేట సహకార సంఘం చైర్మన్‌గా యేన్నం శ్రీధర్ రెడ్డి ఎన్నికయ్యారు. అదనంగా ఐదు మంది వైస్ చైర్మన్లు, 78 మంది డైరెక్టర్లు కూడా ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. అనంతరం ఆయనతో పాటు కేశంపేట మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి నూతన పాలకవర్గ నేతలను సన్మానించారు.

RNI - TELTEL/2023/87644
నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
ఆదివారం, ఆగస్టు 09, 2026


## విజయవంతంగా కొనసాగుతున్న సిపిఐ ప్రచార యాత్ర



**కరీంనగర్, ఆగస్టు 08 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సిపిఐ ఆధ్వర్యంలో ప్రచార యాత్ర కొనసాగుతోంది. చిగురుమామిడి మండల ంలోని బొమ్మనపల్లి, ఉల్లంపల్లి, కొండాపూర్, నవాబుపేట, సుందరగిరి గ్రామాల్లో జాతా పర్యటించింది.మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ పెట్టుబడిదారులకు అప్పగిస్తోందని ఆరోపించారు. మోడీ విధానాలే ప్రజల కష్టాలకు కారణమని, నిత్యావసర వస్తువుల ధరలు, పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరల పెరుగుదలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నిరుద్యోగం పెరుగుతుండటంతో యువత భవిష్యత్తు అనిశ్చితిలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.రైతులకు కనీస మద్దతు ధర చట్టబద్ధత కల్పించాలని, మహిళా రిజర్వేషన్ అమలు చేయాలని, ధరల పెరుగుదలను నియంత్రించాలని, ప్రతి నిరుద్యోగ యువకుడికి ఉద్యోగ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులు సాధించిన హక్కులను హరించకూడదని, సమాన పనికి సమాన వేతనం అందించాలని కోరారు.దేశంలో సామాజిక న్యాయం కొరబడుతోందని, దళిత--ఆదివాసీలపై దాడులు పెరుగుతున్నాయని నిలిపివేయాలని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం బ్యాలెట్ పేపర్ పద్ధతిని పునరుద్ధరించాలని వెంకటరెడ్డి పిలుపునిచ్చారు.జాతాలో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అందె స్వామి, పొనగంటి కేదారి, మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్‌ను పరిశీలించిన ఏసీపీ ఎం. రమేష్



**మంథని, ఆగస్టు 08 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** వార్షిక తనిఖీల్లో భాగంగా గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్ శనివారం మంథని పోలీస్ స్టేషన్‌ను పరిశీలించారు.స్టేషన్ పరిసరాలు, రికార్డులు, కేసు ఫైళ్లను పరిశీలించిన ఆయన పెండింగ్ ఫిర్యాదులు, కేసులను సకాలంలో పరిష్కరించాలని, సీసీటీఎన్ఎస్ లో వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని అధికారులకు ఆదేశించారు. నాణ్యమైన దర్యాప్తు చేపట్టి కోర్టులతో సమన్వయం సాధించి నిందితులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రజల ఫిర్యాదులపై తక్షణ స్పందన ఇవ్వడం, బాధితులకు రక్షణ కల్పించడం పోలీసుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్న ఆయన క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ ప్రజలతో మమేకమై నేరాల నివారణకు కృషి చేయాలని సూచించారు.ఈ తనిఖీలో మంథని సీఐ బుద్దె స్వామి,
ఎస్ఐ సందీప్ కుమార్ పాల్గొన్నారు.

## ఎం.పి.పి.ఎస్ పాఠశాలలో షీ టీమ్ అవగాహన సదస్సు



**రామగుండం, ఆగస్టు 08 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రామగుండం సి.పి ఆదేశాల మేరకు షీ టీమ్ ఇంచార్జ్ ఎస్ఐ లావణ్య ఆధ్వర్యంలో గాంధీ పార్క్ ఎం.పి.పి.ఎస్ స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా షీ టీమ్ సభ్యులు విద్యార్థులకు గుడ్ టచ్--బాడ్ టచ్, పోక్సో యాక్ట్, సోషల్ మీడియా ప్రభావం, ప్రవర్తన నియమావళి, మహిళల భద్రత, ఆన్లైన్ మోసాలు, యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. మహిళలు, విద్యార్థులు వేధింపులకు గురైతే భయపడకుండా 6303923700 నంబర్‌కు ఫోన్ చేయాలని, వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో 100/112 నంబర్లకు, ఆన్లైన్ మోసాలపై 1930 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు. ప్రయాణ భద్రత కోసం టీ – సేఫ్ యాప్ వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ రాంబాబు, ఉపాధ్యాయులు, షీ టీమ్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉన్నత పాఠశాలలో ఘనంగా వనమహోత్సవం



**ఖానాపూర్, ఆగస్టు 08 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఖానాపూర్ మండలంలోని పాత ఎల్లాపూర్ ఉన్నత పాఠశాలలో వనమహోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ సం దర్భంగా ఉపాధ్యాయురాలు రమాదేవి మాట్లా డుతూ ప్రతి విద్యార్థి మొక్కను నాటి కాపాడే బాధ్యత తీసుకోవాలని, తల్లిద ండ్రులు కూడా ఇంటి వద్ద మొక్కలు నాటి పెంచాలని సూచించారు. అడవులు లేకపోవడం వలన పర్యావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయని, వర్షాభావం, పంటల లోటు, ఆకలి సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. చెట్లు పెరిగిన తర్వాత వాటిని కాపాడాలని, నరికివేయకూడదని విద్యార్థులకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు రమాదేవి, ఉపాధ్యాయులు జోగు శ్రీనివాస్, మోహన్ రావు, రాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

## దోమల నివారణకై ఫాగింగ్ నిర్వహణ



**ఖానాపూర్, ఆగస్టు 08 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఖానాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఏడవ వార్డులో దోమల నివారణ చర్యల్లో భాగంగా మున్సిపల్ సిబ్బంది ఫాగింగ్ నిర్వహించారు. మురికికాలువలు, గడ్డి ప్రాంతాల్లో దోమల పెరుగుదలను అరికట్టేందుకు కౌన్సిలర్ నిమ్మల రమేష్ ఆదేశాలతో ప్రతి ఏరియాలో ఫాగింగ్ చేపట్టారు. వర్షాలు అడపాదడపా కురియడం వలన ఇళ్ల ముందు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. దోమల వల్ల మలేరియా, డయేరియా వంటి వ్యాధులు సోకే ప్రమాదం ఉందని, ప్రతి ఇంటి యజమాని పరిశుభ్రత పాటించాలని రమేష్ కోరారు.

## అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



**ఖానాపూర్, ఆగస్టు 08 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం భాగంగా ఖానాపూర్ మున్సిపాలిటీ ఏడవ వార్డులోని అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ నిమ్మల రమేష్ మాట్లాడుతూ తల్లిపాలు శిశువుకు ప్రకృతి ప్రసాదించిన అమూల్యమైన ఆహారం, అమృతం లాంటిదని అన్నారు. పుట్టిన వెంటనే తల్లిపాలు ఇవ్వడం వల్ల శిశువు ఆరోగ్యంగా ఎదుగుతాడని, రోగనిరోధక శక్తి పెరిగి అనేక వ్యాధుల నుండి రక్షణ లభిస్తుందని తెలిపారు. పిల్లలను పరిశుభ్రతతో పెంచే బాధ్యత తల్లిదనని పేర్కొన్నారు.హెల్త్ ఎడ్యుకేటర్ జయలలిత, డాక్టర్ చందన తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. సూపర్వైజర్ ప్రేమలత, అంగన్వాడీ టీచర్ ధనలక్ష్మి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం లావణ్య, ఆశ వర్కర్ లక్ష్మి, ఆయా చంద్రకళ, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

## శ్రీశైలం నీరు తాగునీటి అవసరాలకే వినియోగిస్తాం కలెక్టర్ జి. రాజకుమారి




**నంద్యాల, ఆగస్టు 08 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** శ్రీశైలం జలాశయం నుంచి జిల్లాకు రానున్న నీటిని కేవలం తాగునీటి అవసరాలకే విని యోగించనున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజక ుమారి తెలిపారు. మూడు రిజర్వాయర్లను తాగునీటి అవసరాల మేరకే నింపనున్నట్లు స్పష్టం చేశారు.ప్రస్తుత నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని సాగునీటికి నీటిని అందించే పరిస్థితి లేదని పేర్కొన్నారు. రైతులు అందు బాటులో ఉన్న నీటి వనరులను దృష్టిలో ఉంచు ఓకుని పంటల ప్రణాళికలు రూపొంది ంచుకోవాలని, అధిక నీటి అవసరమయ్యే వరి పంటకు బదులుగా తక్కువ నీటి అవసం మయ్యే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు ప్రకృతి వ్యవసాయం వైపు రైతులను ప్రోత్సహించాలని, ప్రాంతానికి అనుకూలమైన పంటల ఎంపికపై శాస్త్రీయ సూచనలు, సాంకేతిక సహకారం అందిం చాలని వ్యవసాయ అధికారులను ఆదేశిం చారు. 'రైతన్నా నీకోసం--ఎల్‌నినో కాంబ ్యాట్' కార్యక్రమం ద్వారా నీటి పొదుపు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.జిల్లా ప్రజల తాగునీటి అవసరాలను తీర్చడమే ప్రస్తుతానికి అత్యంత ప్రాధాన్యత కలిగిన అం శమని కలెక్టర్ స్పష్టం చేశారు. నీటిని పొదు పుగా వినియోగించి జిల్లా యంత్రా ంగానికి సహకరించాలని ప్రజలు, రైతులను కోరారు.

## వాలీబాల్‌లో ప్రతిభ కనబరిచిన శ్లోకా స్కూల్ విద్యార్థులు



**నందికొట్కూరు, ఆగస్టు 08 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** సీబీఎస్ఈ క్లస్టర్--7 గేమ్స్--2026లో నందికొట్కూరుకు చెందిన శ్లోకా స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి వాలీబాల్ పోటీల్లో ద్వితీయ రన్నరప్‌గా నిలిచారు. జోగులాంబ గద్వాలలోని ఎస్.ఆర్. విద్యానికేతన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరిగిన పోటీల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు చెందిన 140 సీబీఎస్ఈ పాఠశాలలు పాల్గొన్నాయి. బహుమతి ప్రదానోత్సవంలో జిల్లా కలెక్టర్ ఎస్. రిజ్వాన్ బాషా చేతుల మీదుగా విద్యార్థులు ట్రోఫీని అందుకున్నారు.ఈ విజయంపై పాఠశాల చైర్మన్ ఎస్. శ్రీధర్ రెడ్డి, కరస్పాండెంట్ డా. శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్ శ్రీదేవి రెడ్డి, కవితా రెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, కోచ్ విద్యార్థులను అభినందించారు.

## శ్రీశైలం దేవస్థానంలో వరుణయాగం సహిత సహస్రఘటాభిషేకం నిర్వహణ



**శ్రీశైలం, ఆగస్టు 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని సంకల్పంతో శ్రీశైల దేవస్థానంలో వరుణయాగ సహిత సహస్రఘ టాభిషేక విశేష పూజలు జరుగుతు న్నాయి .ఆగస్టు 7 నుంచి ప్రారంభమైన ఈ కార్య క్రమం 11 వరకు కొనసాగనుంది. వేదప ండితులు ఋష్యశృంగ జపం, వరుణానుక మంత్రాలు, భాగవతం, మహాభారతంలోని విరాటపర్వం పారాయణలు నిర్వహిస్తున్నారు. వరుణజపం కోసం ప్రత్యేకంగా నిర్మించిన నీటితొట్టిలో పండితులు కంఠం వరకు మునిగి జపాలు చేస్తున్నారు.నేడు యాగ శాలలో శివసంకల్పం, గణపతిపూజ, రుద్ర– – చండీ కలశస్థాపనలు, విశేషార్చ నలు, రుద్రాపారాయణలు నిర్వహించ బడుతు న్నాయి. సాయంత్రం అంకు ారోపణ, అగ్నిప్రతిష్ఠాపన, రుద్రహోమం, ఉపాంగ దేవతాహవనాలు జరగనున్నాయి. అనంతరం ఋష్యశృంగ సహిత సహస్రఘటస్థాపన, కలశార్చనలు, రుద్రపారాయణలు జరుగ ంతాయి.ఈ విశేష పూజల ద్వారా కరువుకా టకాలు నివారించి సకాలంలో వర్షాలు కురవాలని భక్తులు ప్రార్థిస్తున్నారు.

## ఐఎఫ్టియు మహాసభను జయప్రదం చేయాలని పిలుపు



**నందికొట్కూరు, ఆగస్టు 08 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఉమ్మడి కర్నూలు జిల్లా ఐఎఫ్టియు 3వ మహాసభ ఎమ్మిగనూరులో జరగనుంది. ఈ సందర్భంగా నంద్యాలలో మహాసభ కరపత్రాలను విడుదల చేసిన జిల్లా నాయకులు పి. లాజరస్ కార్మిక వర్గాన్ని సభను జయప్రదం చేయాలని పిలుపు నిచ్చా రు.కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ కార్మిక వ్యతిరేకమని, వాటిని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను బలహీనపరుస్తూ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానాలను ప్రోత్స హించడం వల్ల ఉద్యోగ భద్రత కోల్పోతు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు.సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, అసంఘటిత రంగ కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, పెన్షన్, సామాజిక భద్రతా పథకాలు కల్పించాలని ఆయన కోరారు. కార్మికోద ్యమాన్ని బలోపేతం చేసేందుకు, సమస్యలపై పోరాడేందుకు మహాసభలకు కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పిడిఎస్యు రాష్ట్ర అధ్యక్షుడు రఫీ, ఏఐకేఎంఎస్ నాయకులు ఆనంద్, చాంద్ బాషా, పిడిఎస్యు జిల్లా ఉపాధ్యక్షులు షైక్ షాహీద్, కాంత్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులను నట్టేట ముంచిన టిడిపి కాటసాని



**గడివేముల, ఆగస్టు 08 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** గడివేముల మండల కేంద్రంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షా శిబిరంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు హామీల వర్షం కురిపించి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు వాటిని అమలు చేయకుండా నిరుద్యోగ యువత, విద్యార్థులను నట్టేట ముంచుతోందని విమర్శించారు.20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి హామీలను విస్మరించారని, డీఎస్సీ ప్రక్రియలో అవకతవకలు జరిగాయని ఆయన ఆరోపించారు. స్పోర్ట్స్ కోటా జీవోలను మార్చి తమ అనుకూలంగా ఉద్యోగాలు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలను అరకొరగా అమలు చేస్తూ కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు.డీఎస్సీ కుంభకోణంపై సిబిఐ విచారణ జరిగే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యుడు ఆర్.బి. చంద్రశేఖర్ రెడ్డి, మండల వైసీపీ కన్వీనర్ మధుసూదన్ గుప్తా, వైసీపీ నాయకులు మేఘనాథ్ రెడ్డి, గని ప్రతాప్ రెడ్డి, సివి రమణయ్య, దేశం నాగేశ్వరరెడ్డి, ఎంపీటీసీ వంగాల మహేశ్వర్ రెడ్డి, రఘు మాధవరెడ్డి, ఎల్లారెడ్డి, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## నారాయణపూర్ రిజర్వాయర్ అభివృద్ధికి రూ. 20 కోట్లు మంజూరు



**గంగాధర, ఆగస్టు 08 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని నారాయణపూర్ రిజర్వాయర్ అభివృద్ధికి ప్రభుత్వం రూ. 20 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులు కట్ట మరమ్మత్తులు, గ్రావిటీ కాలువల పూర్తి, బండ్ పటిష్టం వంటి పనులకు వినియోగించ నున్నారు.ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కృషితో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జలవనరుల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించారు. రిజర్వాయర్ పనులు పూర్తయితే చొప్పదండి నియోజ కవర్గంతో పాటు పరిసర ప్రాంతాల్లో సుమారు 49,500 ఎకరాలకు సాగునీరు అందనుంది. బ్యాలెన్సింగ్ నీటి ద్వారా మరో లక్ష ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉంది.ఇంతకుముందు నిర్వాసితుల పరిహారం కోసం రూ. 23.50 కోట్లు మంజూరు చేయించిన ఎమ్మెల్యే, ఇప్పుడు రిజర్వాయర్ అభివృద్ధి కోసం మరో రూ. 20 కోట్లు మంజూరు చేయించారని తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీరు అందించడమే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

## ఘనంగా ఆషాఢమాస బోనాల వేడుకలు



**గంగాధర, ఆగస్టు 08 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలోని వివేకానంద విద్యాలయంలో ఆషాఢమాస బోనాల పండుగను శనివారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో ఈ వేడుకలు వైభవంగా జరిగాయి.విద్యార్థులు సంప్ర దాయ దుస్తుల్లో పాల్గొని బోనాలను అలంకరించి అమ్మవారికి సమర్పించారు. పోతరాజుల విన్యాసాలు, పెద్దపులుల నృత్యాలు, జానపద ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. డప్పుల మోతలతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ చిన్నతనం నుంచే విద్యార్థులకు సంస్కృతి--సాంప్రదాయాలను పరిచయం చేయడం ద్వారా వారిలో గౌరవం, అభిమానం పెంపొందుతుందని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ అనంతరెడ్డి, ప్రధానోపాధ్యాయులు నర్సింగరావు, ఉషారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## చల్మెడ రాజేశ్వర్‌రావుకు ఘన సన్మానం



**కరీంనగర్, ఆగస్టు 08 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ డెయిరీ చైర్మన్ చల్మెడ రాజేశ్వర్‌రావుకు అమెరికా మేరీల్యాండ్ స్టేట్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రధానం చేయడం రైతులకే గర్వకారణమని మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు.శనివారం ఆయన రాజేశ్వర్‌రావును శాలువాతో సన్మాని ంచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పాడి పరిశ్రమ అభివృద్ధి కోసం, రైతులకు అదనపు ఆదాయం కల్పించేందుకు రాజేశ్వర్‌రావు చేసిన కృషి విశేషమని పేర్కొన్నారు. 1971లో 12 వేల లీటర్ల సామర్థ్యంతో ప్రారంభమైన కరీంనగర్ డెయిరీని నేడు 3 లక్షల లీటర్లకు పెంచడంలో ఆయన పట్టుదల ప్రధానమని అన్నారు.రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడంలో, పాల ఉత్పత్తుల మార్కెట్ విస్తరణలో రాజేశ్వర్‌రావు కీలక పాత్ర పోషించారని, భవిష్యత్తులో మరిన్ని అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ సభ్యులు బూడిద సదాశివ పాల్గొన్నారు.

## ఘనంగా సురభి కాన్వెంట్‌లో గోరింటాకు, బోనాల వేడుకలు



**గంగాధర, ఆగస్టు 08 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కరీంనగర్ జిల్లా గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలోని సురభి కాన్వెంట్ హై స్కూల్లో శనివారం గోరింటాకు, బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యా ర్థులు సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొని గోరిం టాకు పెట్టుకుంటూ సందడి చేశారు.బోనాలను తలపై ఎత్తుకుని భక్తిశ్రద్ధలతో ప్రదర్శనలు నిర్వహించారు. అబ్బాయిలు పోతరాజు, పులి వేషధారణలో చేసిన జానపద నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తెలంగాణ పాటలు, నృత్యాలతో విద్యార్థులు అలరించారు.ఈ సం దర్భంగా కరస్పాండెంట్ చిప్ప వీరేశం, డైరెక్టర్ చిప్ప వీర నర్సయ్య మాట్లాడుతూ ఆధునిక విద్యతో పాటు విద్యార్థులకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించడం తమ బాధ్యత అని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు చిన్నారుల్లో సంప్రదాయాల పట్ల గౌ రవం, అభిమానం పెంపొందిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతుబజార్‌లో పండించి విక్రయించే రైతులకు ప్రాధాన్యత డిప్యూటీ మేయర్



**కరీంనగర్, ఆగస్టు 08 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కాశ్మీర్‌గడ్డ రైతుబజార్‌లో కూరగాయలు పండించి విక్రయించే రైతులకు, ముఖ్యంగా గతంలో ఇక్కడ వ్యాపారం చేసిన వారికి మొదటి ప్రాధాన్యత ఇస్తామని డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు తెలిపారు.'సన్నకారు రైతుల సంక్షేమ సంఘం' బాధ్యులు క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం సమర్పించగా, ఆయన రైతులతో మాట్లాడి భరోసా ఇచ్చారు. రూ. 10 కోట్లతో నిర్మించిన నూతన మార్కెట్ భవనంలో గదులు, స్టాల్స్ పూర్తిగా రైతులకే కేటాయిస్తామని, ఎవరూ ఆందోళన చెందవద్దని స్పష్టం చేశారు.రైతులు పండించిన కూరగాయలను సులభంగా విక్రయించుకునేలా సౌకర్యాలు కల్పించడం ద్వారా వారి ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు కోనుకటి లచ్చిరెడ్డి, ఉపాధ్యక్షుడు కమటం మల్లేశం, ప్రధాన కార్యదర్శి పారెడ్డి రవీందర్‌రెడ్డి, సం యుక్త కార్యదర్శి మెంగని శ్రీకాంత్, కోశాధికారి సింగిరెడ్డి శ్రీనివాస్,
ఇతర సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా 25వ వివాహ వార్షికోత్సవం వేడుకలు




**కరీంనగర్, ఆగస్టు 08 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ ఆధ్వర్యంలో బోడ్ల నవీన్, బోడ్ల రాజనీదేవి దంపతులు తమ 25వ వివాహ వార్షికోత్సవాన్ని సేవా కార్యక్రమాలతో జరుపుకున్నారు. మనోవికాస్ స్పెషల్ స్కూల్‌లో విద్యార్థుల కోసం 25 కుర్చీలను విరాళంగా అందించి, మధ్యాహ్న భోజనం వడ్డించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ సభ్యులు దంపతులను ఘనంగా సత్కరించారు. పాఠశాల యాజమాన్యం కూడా వారి సేవా కార్యక్రమాన్ని అభినందించింది. క్లబ్ అధ్యక్షుడు మైదం శివాకాంత్ పటేల్ మాట్లాడుతూ, వార్షికోత్సవాన్ని సేవా భావంతో జరుపుకోవడం లయన్స్ క్లబ్ "వీ సర్వ్" స్ఫూర్తికి చక్కని నిదర్శనమని పేర్కొన్నారు. కార్యక్రమంలో లయన్స్ సభ్యులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల కారణంగా విద్యుత్ అంతరాయం

**కరీంనగర్ రూరల్, ఆగస్టు 08 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** నెలవారీ సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల కారణంగా బొమ్మకల్ 33/11 కేవీ ఎస్ఎస్‌లో శనివారం ఉదయం 9 గంటల నుండి 11:30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడనుంది. సిరిపురం కాలనీ, రజ్వీ చమన్ సిటిజన్ కాలనీ, ప్రియదర్శిని కాలనీ, కృష్ణనగర్ కాలనీ, ఆటోనగర్, ధర్మనగర్, బైపాస్ రోడ్, బొమ్మకల్, గుంటూరుపల్లి, విజయనగర్ కాలనీ, సలాఫీనగర్ ప్రాంతాల్లో సరఫరా అంతరాయం ఉంటుంది. ప్రజలు సహకరించాలని ఏడీఈ గడం రఘు ఒక ప్రకటనలో తెలిపారు.

## కస్తూర్బా గాంధీ విద్యాలయంలో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహణ



**హుస్నాబాద్, ఆగస్టు 08 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కస్తూర్బా గాంధీ విద్యాలయంలో 'మేరా యువభారత్ (మై భారత్)' సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛత పక్షవాడ కార్యక్రమం జరుగుతోంది. ఆగస్టు 1 నుండి 15 వరకు విద్యార్థులకు స్వచ్ఛభారత్ ప్రతిజ్ఞ చేయించడం, పరిసరాల పరిశుభ్రతపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వలస సుభాష్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ కలగన్న పరిశుభ్రమైన భారతదేశం కోసం ప్రతి విద్యార్థి బాధ్యతగా ముందడుగు వేయాలని సూచించారు. పరిశుభ్రమైన పరిసరాలు ఆరోగ్యానికి, సమాజ అభివృద్ధికి కీలకమని, గ్రామాలు--పట్టణాల్లో స్వచ్ఛ భారత్ సందేశాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని విద్యార్థులను కోరారు. వ్యాసరచన పోటీల్లో విజేతలకు మంగళవారం బహుమతులు అందజేయనున్నారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి రాగుల మమత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు




**కరీంనగర్ రూరల్, ఆగస్టు 08 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** అక్రమ ఇసుక రవాణాపై కరీంనగర్ రూరల్ పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. గోపాల్‌పూర్, గుంటూరుపల్లి, బైపాస్ జియో పెట్రోల్ బంక్ సమీపంలో అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు బేతి సునీల్ రెడ్డి, కొత్తూరి కుమార్, కొత్తూరి ఆంజనేయులు, పోస్టు గణేష్, గడిప్రబాలయ్యలను అదుపులోకి తీసుకున్నారు. వారు సుల్తానాబాద్ మండలం గొల్లపల్లి మానేరు వాగు నుండి ఇసుకను అక్రమంగా తీసుకువచ్చి పట్టణంలో అధిక ధరలకు విక్రయించేందుకు ప్రయత్నించినట్లు విచారణలో వెల్లడైంది. ట్రాక్టర్లను పంచనామా నిర్వహించి కోర్టులో డిపాజిట్ చేయగా, నిందితులపై కేసులు నమోదు చేశారు. ఇకపై అక్రమ ఇసుక రవాణాపై ఏమాత్రం ఉపేక్షించబోమని, పదేపదే నిబంధనలు ఉల్లంఘించే వారిపై రౌడీ షీట్లు, పీడీ యాక్ట్ వంటి కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ ఇన్‌స్పెక్టర్ ఏ. నిరంజన్ రెడ్డి హెచ్చరించారు.

## వృద్ధురాలిని పరామర్శించిన యాదగిరి సునీల్‌రావు



**కరీంనగర్, ఆగస్టు 08 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** సుభాష్‌నగర్‌లో వృద్ధురాలు జంగం రాజమ్మపై దొంగ మునుగొండ మధు దాడి చేసి ఆభరణాలు దోచుకెళ్లిన ఘటనపై బీజేపీ రాష్ట్ర ప్రతినిధి, మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు ఆసుపత్రిలో ఆమెను పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని సూచించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. బాధితురాలికి తక్షణ ఆర్థిక సాయం అందజేశారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, వైద్యులు పాల్గొన్నారు.ద

## అల్ఫోర్స్ విద్యార్థులకు ఘన సన్మానం




**కరీంనగర్, ఆగస్టు 08 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సాధించిన విద్యార్థులకు ఘన సన్మానం జరిగింది. ఈ సందర్భంగా వీఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం పెరుగుతుందని అన్నారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లో శ్రీ త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో జరిగిన 12 గంటల నిర్విరామ సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొని రికార్డ్స్‌లో స్థానం సంపాదించిన 9వ తరగతి విద్యార్థిని ఎం. స్నేహిత, 3వ తరగతి విద్యార్థిని అదిత్రీలను అభినందించారు. విజేతలకు పుష్పగుచ్ఛాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఈనెల 20న ఏఐటీయూసీ మహాసభకు పిలుపు



**సుల్తానాబాద్, ఆగస్టు 08 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** పెద్దపల్లి జిల్లా నాలుగో ఏఐటీయూసీ మహాసభను ఆగస్టు 20న సుల్తానాబాద్‌లోని యశోద నరహరి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్ తెలిపారు. మహాసభ విజయవంతం కోసం కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన వర్కర్స్ సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని, కనీస వేతనాలు అమలు చేయకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు, హమాలీలు, అంగన్‌వాడీ, ఆశా, ఏఎన్ఎం, కాంట్రాక్ట్ కార్మికులు, స్కీమ్ వర్కర్ల సమస్యలపై మహాసభలో విస్తృత చర్చ జరిపి భవిష్యత్ పోరాటాలకు కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. జిల్లా మహాసభకు జాతీయ, రాష్ట్ర నాయకులు హాజరుకానున్నందున పెద్ద సంఖ్యలో కార్మికులు, ఉద్యోగులు తరలివచ్చి విజయవంతం చేయాలని కడారి సునీల్ కోరారు.

## శ్రీరామ హృదయ కలశానికి ఘన స్వాగతం



**సుల్తానాబాద్, ఆగస్టు 08 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ముచ్చింతల్ శ్రీరామానుజ సహస్రాబ్ది సమతా విగ్రహ క్షేత్రం నుంచి పంపిన శ్రీరామ హృదయ కలశానికి సుల్తానాబాద్‌లో శనివారం భక్తిశ్రద్ధలతో ఘన స్వాగతం లభించింది. పట్టణంలోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం నుంచి నగర సంకీర్తన నిర్వహించగా, భక్తుల శ్రీరామ నామస్మరణ, భజనలతో వీధులు ఆధ్యాత్మిక వాతావరణంతో మార్మోగాయి. అనంతరం కలశాన్ని ఇంటింటికీ తీసుకెళ్లి భక్తులు "శ్రీరామ... శ్రీరామ..." అంటూ నామస్మరణ చేసి బియ్యం గింజలు సమర్పించారు. కార్యక్రమ కన్వీనర్లు సాదుల సుగుణాకర్, సునీత మాట్లాడుతూ ఇంటింటా ఆధ్యాత్మిక సంఘాల ఏర్పాటు, సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. భక్తులు సమర్పించిన బియ్యం గింజలతో కూడిన కలశాలను చిన్నజీయర్ స్వామివారు స్వయంగా శ్రీరామచంద్రునికి అభిషేకం చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అంతటి పుష్పలత, జిల్లా ప్రతినిధులు జువ్వాడి భాస్కరరావు, సుజాత, రాజు, అర్చకులు వినయ్ త్రిపాఠి, కొమురవెల్లి భాస్కర్, వోల్లాల రాజు, తిరుపతి రెడ్డి, భగవాన్, బండి రాము, ఎరవెల్లి శైలజ, బూరుగు సత్యం, పవన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



**హుస్నాబాద్, ఆగస్టు 08 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హుస్నాబాద్ మండలం నాగారం గ్రామ అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ ఇజ్జగిరి సంపత్ మాట్లాడుతూ శిశువుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తల్లిపాలు ఎంతో అవసరమని, పుట్టిన వెంటనే శిశువుకు తల్లిపాలు అందించాలని సూచించారు. బాలింతలు తల్లిపాలపై అవగాహన పెంచుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కే. తిరుపతి, వార్డు సభ్యుడు ఇజ్జగిరి కిష్టయ్య, అంగన్వాడీ టీచర్ రాజమణి, ఏఎన్ఎం పద్మశ్రీలత, ఆశ కార్యకర్త రేణుకతో పాటు గర్భిణులు, బాలింతలు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

## ఇంటింటా పెన్షన్ దరఖాస్తుల స్వీకరణ



**సుల్తానాబాద్, ఆగస్టు 08 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పెన్షన్ పథకంలో అర్హులైన నిరుపేదలకు లబ్ధి చేకూర్చేందుకు సుల్తానాబాద్ మున్సిపాలిటీలో ఇంటింటా దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోంది. ప్రజాప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది ఆధ్వర్యంలో ఆగస్టు 15 నుంచి అర్హులైన వారికి పెన్షన్లు అందించే లక్ష్యంతో చర్యలు చేపడుతున్నారు. 7వ వార్డులో కౌన్సిలర్ వరప్రదీప్, 9వ వార్డులో తౌర్రికొండ ప్రభాకర్--ఆసిఫ్, 10వ వార్డులో వైస్ చైర్‌పర్సన్ అంతటి పుష్పలత--అన్నయ్య గౌడ్, 11వ వార్డులో కల్వల శంకరమ్మ--ఓదేలు ఆధ్వర్యంలో అర్హులైన లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అర్హత ఉన్న ప్రతి నిరుపేదకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనం అందేలా ఇంటింటా పరిశీలన చేపడుతున్నట్లు కౌన్సిలర్లు తెలిపారు. అవసరమైన పత్రాలు సమర్పించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అర్హులను కోరారు.

## శ్రీవాణి కళాశాలలో బోనాలు, గోరింటాకు సంబరాలు




**సుల్తానాబాద్, ఆగస్టు 08 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సుల్తానాబాద్‌లోని శ్రీవాణి జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం బోనాలు, గోరింటాకు సంబరాలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను పురస్కరించుకుని కళాశాల ప్రాంగణంలో ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. గోరింటాకు సంబరాల్లో విద్యార్థినులు ఒకరి చేతికి ఒకరు గోరింటాకు పెట్టుకుంటూ సందడి చేశారు. ఆకర్షణీయమైన డిజైన్లతో చేతులను అలంకరించుకుని ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థినులు సంప్రదాయబద్ధంగా బోనాలను అలంకరించి కళాశాలకు తీసుకువచ్చారు. బోనాల అలంకరణలు, గోరింటాకు వేడుకలతో కళాశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. సంప్రదాయ దుస్తుల్లో పాల్గొన్న విద్యార్థినులు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పారు. విద్యార్థుల్లో సంప్రదాయాలపై అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కళాశాల యాజమాన్యం తెలిపింది. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడం పట్ల నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు.

## బోనాల ఏర్పాట్లు పరిశీలించిన సునీల్‌రావు



**కరీంనగర్, ఆగస్టు 08 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భగత్‌నగర్ మున్నూరు కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జరగబోయే బోనాల మహోత్సవ ఏర్పాట్లను డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు శనివారం పరిశీలించారు. సెంట్రల్ వేర్‌హౌస్ గోదాంలోని పోచమ్మ తల్లి ఆలయాన్ని సందర్శించి ఏర్పాట్లను సమీక్షించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా మౌలిక వసతులు కల్పించాలని, ఊరేగింపు మార్గాల్లో పారిశుధ్య పనులు ముమ్మరం చేయాలని, త్రాగునీటి సౌకర్యం అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. పండుగకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానున్నందున ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగిన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తెలంగాణ సంస్కృతి--సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాలను అత్యంత ఘనంగా నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు గట్టుస్వామి, ఖాలీద్, నాగరాజు, సానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## కూచనపల్లి వాగుపై బిడ్జ్ నిర్మాణానికి నిధులు మంజూరు



**హుస్నాబాద్, ఆగస్టు 08 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** హుస్నాబాద్ మండలం కూచనపల్లి గ్రామంలో వాగుపై బిడ్జ్ నిర్మాణానికి ప్రభుత్వం రూ. 3 కోట్లు మంజూరు చేసింది. వర్షాకాలంలో వాగులోకి నీళ్లు చేరడంతో రైతులు, ప్రజలు అవతల వైపు వెళ్లడంలో ఇబ్బందులు పడుతుండగా, ప్రతిపక్ష పార్టీలు అనేకసార్లు పోరాటం చేసిన ఫలితంగా నిధులు కేటాయించబడ్డాయి. మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ, ఎల్లమ్మ చెరువు మత్తడి వద్ద అంకుస్‌గండి పై కూడా బిడ్జ్ నిర్మాణానికి నిధులు వెంటనే మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు. బిడ్జ్ నిర్మాణం పూర్తయితే కూచనపల్లి నుంచి హుస్నాబాద్ పట్టణానికి రాకపోకలు సులభమవుతాయని, రైతుల ఇబ్బందులు తొలగుతాయని బీఆర్ఎస్ నాయకుడు అయిలేని మల్లికార్జున రెడ్డి తెలిపారు.

## బ్లూబెల్స్ హైస్కూల్‌లో ఘనంగా బోనాల వేడుకలు



**కరీంనగర్, ఆగస్టు 08 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** హనుమాన్‌నగర్‌లోని బ్లూబెల్స్ హైస్కూల్లో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులకు పరిచయం చేయడం లక్ష్యంగా ఈ వేడుకలు జరిగాయి. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని బోనాల పండుగకు సంబంధించిన పాత్రలను ధరించి అలరించారు. జానపద పాటలు, నృత్యాలతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. కరస్పాండెంట్ జంగా సునీత మనోహర్‌రెడ్డి విద్యార్థుల ప్రదర్శనలను వీక్షించి, ఇటువంటి కార్యక్రమాలు భావితరాలకు సంస్కృతి--సంప్రదాయాలను పరిచయం చేయడంలో ఉపయోగపడతాయని అన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

## విజన్ హై స్కూల్‌లో ఘనంగా బోనాల సంబరాలు



**కరీంనగర్, ఆగస్టు 08 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** రేకుర్తిలోని విజన్ హై స్కూల్‌లో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సిరిపురం ప్రసాద్ మాట్లాడుతూ ఆషాఢమాసంలో తెలంగాణలో ప్రత్యేకంగా జరుపుకునే బోనాల పండుగను విద్యార్థులకు పరిచయం చేయడం లక్ష్యమని తెలిపారు. పోచమ్మ తల్లికి బోనం సమర్పించి అందరికీ సుఖసంతోషాలు కలగాలని కోరుకున్నారు. విద్యార్థులు పోతురాజు, అమ్మవారి వేషధారణలో ఆకట్టుకోగా, సాంస్కృతిక కార్యక్రమాలతో తల్లిదండ్రులను అలరించారు. ఈ విధంగా పాఠశాలలో సంప్రదాయ పండుగలు నిర్వహించడం పట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్స్ సందవేణి వెంకట్, ఇంచార్జ్ ప్రతిభ భారతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## విద్యుత్ బిల్లుల చెల్లింపులో ఆదర్శంగా కరీంనగర్ జిల్లా




**కరీంనగర్, ఆగస్టు 08 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** గ్రామ పంచాయతీల విద్యుత్ బిల్లుల చెల్లింపులో కరీంనగర్ జిల్లా రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచింది. జనవరి--జూలై 2026 మధ్య రూ.11.26 కోట్ల బకాయిలలో రూ.5.71 కోట్లు గ్రామపంచాయతీలు తమ సొంత నిధుల నుంచి చెల్లించాయి. దీంతో సుమారు 50 శాతం బకాయిలు క్లియర్ అయ్యాయి. రాష్ట్రంలో అత్యధిక చెల్లింపులు చేసిన జిల్లాల్లో కరీంనగర్ ఆరో స్థానంలో నిలిచింది. టీజీఎన్‌పీడీసీఎల్, జిల్లా పంచాయతీ అధికారుల సమన్వయంతో ప్రత్యేక రీకన్సిలియేషన్ ప్రక్రియ చేపట్టి రూ.2.14 కోట్ల మేర బిల్లుల భారం తగ్గించారు. ఇకపై నెలవారీగా విద్యుత్ వినియోగ ఛార్జీలను సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. సర్పంచుల సహకారంతో పన్నుల వసూళ్లు, అద్దెలు, వేలం వంటి ఆదాయ మార్గాలను పెంచి గ్రామాల్లో మరింత అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే అవకాశం ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు.

## ఓబీసీ మోర్చా భూపాలపల్లి ఇన్‌చార్జిగా పిడుగు కృష్ణ నియామకం



**రామగుండం, ఆగస్టు 08 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఇన్‌చార్జిగా పిడుగు కృష్ణ ముదిరాజ్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షుడు జి. ఆనంద్ గౌడ్, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు, కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్‌తో పాటు తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని ఓబీసీల సంక్షేమం కోసం, వారు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పిడుగు కృష్ణ స్పష్టం చేశారు. పిడుగు కృష్ణ ముదిరాజ్ మాజీ కార్పొరేటర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పనిచేస్తున్నారు.

# టీపీసీసీ సోషల్ మీడియా చైర్మన్‌గా నవీన్ పెట్టం నియామకం



**హుస్నాబాద్, ఆగస్టు 08 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** టీపీసీసీ సోషల్ మీడియా చైర్మన్‌గా నవీన్ పెట్టం ఎంపిక కావడం హర్షణీయమని ఎల్కతుర్తి మండల కాంగ్రెస్ సోషల్ మీడియా సమన్వయకర్త అంబాల జగన్ తెలిపారు. నవీన్ పెట్టంపై పార్టీ అధిష్ఠానం, రాష్ట్ర నాయకత్వం ఉంచిన నమ్మకానికి ఈ పదవి నిదర్శనమని పేర్కొన్నారు. సోషల్ మీడియా ద్వారా కాంగ్రెస్ సిద్ధాంతాలు, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లేందుకు ఆయన కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ బలోపేతానికి చురుకైన పాత్ర పోషిస్తూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి ప్రజలకు, పార్టీకి సేవ చేయాలని అంబాల జగన్ ఆకాంక్షించారు.

## ఎస్ఆర్ హై స్కూల్‌లో ఘనంగా బోనాల వేడుకలు



**కరీంనగర్, ఆగస్టు 08 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జ్యోతి నగర్‌లోని ఎస్ఆర్ హై స్కూల్‌లో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్, కార్పొరేటర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల పండుగను భావితరాలకు పరిచయం చేయడం మనందరి బాధ్యత అని అన్నారు. విద్యార్థులు సంప్రదాయ వేషధారణలో బోనాలు సమర్పించి చేసిన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రవీణ్‌రావు మాట్లాడుతూ చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా పిల్లల్లో సంప్రదాయాల పట్ల గౌరవం, ఆసక్తి పెరుగుతుందని పేర్కొన్నారు. అమ్మవారి దయతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రసాదాలు పంపిణీ చేసి వేడుకలను విజయవంతం చేశారు.

## ఘనంగా పోచమ్మ తల్లి బోనాలు



**కరీంనగర్, ఆగస్టు 08 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కరీంనగర్ నగర 6వ డివిజన్ బొమ్మకల్‌లో నిర్వహించిన పోచమ్మ తల్లి బోనాల ఉత్సవాల్లో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు సమర్పించిన ఆయన, ప్రజలు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. బోనాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని, ఇటువంటి పండుగలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మేకల వెంకటేష్, గాదె రూప శ్రీనివాస్, కో-ఆప్షన్ సభ్యుడు ఎలగందుల నందకుమార్, పురమళ్ళ శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

## చేయూత పింఛన్ల దరఖాస్తుల స్వీకరణ



**మంచిర్యాల, ఆగస్టు 08 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** చేయూత సామాజిక భద్రత పింఛన్ల కోసం అర్హులైన వారు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయం, మున్సిపల్ కార్యాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, కల్లుగీత కార్మికులు, సికిల్ సెల్, తలసేమియా, హీమోఫీలియా బాధితులు, బీడీ కార్మికులు, బీడీ టెకెదర్లు, బోదకాలు, డయాలసిస్ రోగులు, చేనేత కార్మికులు పింఛన్‌కు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తుతో పాటు ఆధార్, రేషన్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ, బ్యాంకు ఖాతా పుస్తకం, కుల ధ్రువీకరణ, యూసిఐడి ధ్రువీకరణ పత్రాలు జత చేయాలని సూచించారు. అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

## ఏఎస్ఐ శ్రీనివాస్‌కు ఘన సత్కారం




**గంగాధర, ఆగస్టు 08 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కొండగట్టు ఓట్‌పోస్ట్ ఇన్‌చార్జ్ ఏఎస్ఐ చిలుక శ్రీనివాస్ సేవా గుణాన్ని గుర్తించి గౌడ నిత్యాన్నధాన సత్రం ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం సత్కరించారు. ఆరెపల్లికి చెందిన గౌడ కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో కొండగట్టులో జీవిస్తున్న పరిస్థితిని గమనించిన ఆయన, వారి కుమారుడు రాజేష్‌కు విద్య కొనసాగేందుకు సహాయం చేశారు. తంగళ్ళపెల్లి హైస్కూల్ నుండి సర్టిఫికెట్లు తెప్పించి ప్రభుత్వ హైస్కూల్‌లో అడ్మిషన్ కల్పించారు. పదవ తరగతి ఉత్తీర్ణత సాధించిన తరువాత కరీంనగర్ సైన్స్ కాలేజీలో ఇంటర్మీడియట్‌లో చేరేలా చేసి, మూడు జతల దుస్తులు, నగదు అందజేశారు. ఈ సేవా దృక్పథాన్ని గుర్తించి ట్రస్ట్ ఫౌండర్ అండ్ చైర్మన్ మంద వేణుగోపాల్ గౌడ్, జాయింట్ సెక్రటరీ కోల రాజేశం గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాళ్ళపెల్లి లింగయ్య గౌడ్‌లు ఏఎస్ఐ శ్రీనివాస్‌ను సత్కరించారు.

## పెట్రోల్‌లో ఇథనాల్ కలుపాలన్న నిర్ణయాన్ని వెనక్కితీసుకోవాలని బీఎస్పీ డిమాండ్




**హుస్నాబాద్, ఆగస్టు 08 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలపాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని బీఎస్పీ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వచ్చిమట్ల రవీందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. 20 శాతం ఇథనాల్ మిశ్రమం వాహనాల ఇంజిన్లు, విడిభాగాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. గతంలో ఇథనాల్ మిశ్రమాన్ని 5--10 శాతానికే పరిమితం చేశారని గుర్తుచేశారు. అమెరికా, కెనడా వంటి దేశాల్లో స్వచ్ఛమైన పెట్రోల్‌తో పాటు మిశ్రమ పెట్రోల్ కూడా అందుబాటులో ఉంటుందని తెలిపారు. ప్రజలకు కలిగే ప్రయోజనాలు, నష్టాలపై నిపుణులతో చర్చించకుండా కేంద్రం నిర్ణయం తీసుకోవడం సరికాదని విమర్శించారు. అమెరికాతో ఒప్పందాల నేపథ్యంలో తీసుకుంటున్న నిర్ణయాలు దేశంలోని లక్షలాది వాహనదారులపై భారం మోపే పరిస్థితి తలెత్తకూడదని హెచ్చరించారు. కేంద్రం పునరాలోచించి ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# కొండనాగులలో బీజేపీ మండల కార్యవర్గ సమావేశం



**బల్మూర్, ఆగస్టు 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బల్మూర్ మండలంలోని కొండనాగుల గ్రామంలో శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం వద్ద బీజేపీ మండల కార్యవర్గ సమావేశం జరిగింది. మండల అధ్యక్షుడు బాలస్వామి యాదవ్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా బీజేపీ జిల్లా కార్యదర్శి వరికుప్పల ఆంజనేయులు, మాజీ ఉపాధ్యక్షుడు రమేష్ రావు హాజరయ్యారు. మండలంలోని వివిధ మోర్చాల పూర్తి కమిటీల ఏర్పాటు, హర్ ఘర్ తిరంగా కార్యక్రమాల నిర్వహణపై సమీక్ష చేపట్టారు. అలాగే సర్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సమావేశంలో బీజేపీ ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రవీందర్ చౌహాన్, మాజీ మండల అధ్యక్షుడు పెద్దయ్య యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి బోల్గం సైదులుతో పాటు రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, శక్తి కేంద్ర ఇన్‌చార్జీలు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జైపాల్ రెడ్డి సేవలను అవమానించడం కేటీఆర్ అహంకారానికి నిదర్శనం కాయితి విజయకుమార్ రెడ్డి



**కల్వకుర్తి, ఆగస్టు 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షుడు కాయితి విజయకుమార్ రెడ్డి మాట్లాడుతూ, “దివంగత మాజీ మంత్రి జైపాల్ రెడ్డి తెలంగాణ ఉద్యమానికి, పార్లమెంటరీ రాజకీయాలకు చేసిన సేవలను ప్రశ్నించే స్థితిలో కేటీఆర్ లేదా బీఆర్ఎస్ నాయకులు లేరు. ఆయన ౧వశ్రీఖఅస్త్రుఖఖ కోసం చేసిన పోరాటాన్ని తక్కువ చేసి మాట్లాడటం అంటే ఒక తరాన్ని అవమానించడం, భారత పార్లమెంటరీ చరిత్రను అవమానించడం” అని అన్నారు. జైపాల్ రెడ్డి తెలంగాణ కోసం తన వాణిని వినిపిస్తున్న సమయంలో, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పార్లమెంట్ వేదికపై ఎంతగా పోరాడారో ప్రజలకు తెలుసని, ఉద్యమాన్ని ఒక్క కుటుంబం సొంత ఆస్తిలా భావించడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. “జైపాల్ రెడ్డి సేవలను అవమానిస్తే తెలంగాణ సమాజం చూస్తూ ఊరుకోదు. కేటీఆర్ వెంటనే వ్యాఖ్యలను ఉపసంహరించుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలి, లేకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది” అని హెచ్చరించారు.

## రమేష్‌కు గంప వెంకటేష్ అభినందనలు




**- జన్మదిన వేడుకల్లో మొక్కలు నాటి, రోగులకు పండ్లు పంపిణీ**

**ఆమనగల్లు, ఆగస్టు 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్లు మున్సిపాలిటీ 8వ వార్డు కౌన్సిలర్ ఎనుమల్ల రమేష్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సింగిల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి రమేష్‌కు తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సింగిల్ విండో కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటడంతో పాటు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గంప వెంకటేష్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ 8వ వార్డు అభివృద్ధికి రమేష్ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. వార్డు ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు రమేష్ చేస్తున్న కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. భవిష్యత్‌లో మరింత ఉత్సాహంతో ప్రజాసేవ కొనసాగిస్తూ వార్డు అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పాపిశెట్టి రాము, దుడ్డు ఆంజనేయులు యాదవ్, నాగిళ్ల జగన్, పుల్లారెడ్డి అనూష శ్రీశైలం, ఎంగలి భాగ్యమ్మ రఘు, మాజీ కౌన్సిలర్ కమటం రాధమ్మ వెంకటయ్యతో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# నూతన కాంగ్రెస్ అధ్యక్షులకు ఖలీల్ సన్మానం



**ఆమనగల్లు, ఆగస్టు 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఇటీవల నూతనంగా ఎన్నికైన ఆమనగల్లు మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు అవ్వారి శివలింగం, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డిని శనివారం బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఎంఏ ఖలీల్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారికి శాలువాలు కప్పి అభినందనలు తెలిపారు. నూతన బాధ్యతల్లో విజయవంతంగా రాణిస్తూ పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు కార్యకర్తలను సమన్వయం చేసుకుని పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. నూతన అధ్యక్షుల నాయకత్వంలో పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేసి ప్రజలకు మరింత చేరువ కావాలని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని అన్నారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షులకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పూర్తి సహకారం అందించాలని ఖలీల్ కోరారు. కార్యక్రమంలో అలీం, రఫీ, నాజర్, రాజు, శీను తదితరులు పాల్గొన్నారు.

# సదర్ మార్ట్ కెనాల్‌కు నీటి విడుదల



**ఖానాపూర్, ఆగస్టు 08 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఎట్టకేలకు సదర్ మార్ట్ కెనాల్‌కు నీటి విడుదలకు ముహూర్తం ఖరారు కావడంతో ఆయకట్టు రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఈ ఏడాది వర్షాలు ఆలస్యంగా కురవడంతో సాగు నీటి పరిస్థితిపై రైతులు ఆందోళన చెందగా, తాజాగా కురిసిన వర్షాలతో వాతావరణం చల్లబడటంతో ఊరట లభించింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో ఆశించిన స్థాయిలో నీటి నిల్వలు లేకపోవడంతో ఆరుతడి పంటల సాగు చేయాలని ప్రభుత్వం, వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సూచించారు. ఈ నేపథ్యంలో సదర్ మార్ట్ కెనాల్ ద్వారా నీటిని విడుదల చేయాలని నిర్ణయించడం రైతులకు చల్లని కబురు అందించింది. ఎమ్మెల్యే చేతుల మీదుగా నీటి విడుదల కార్యక్రమం నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ నాయకులు, అధికారులు తెలిపారు. దీంతో సదర్ మార్ట్ ఆయకట్టు పరిధిలోని రైతులు సాగు పనులకు సిద్ధమవుతున్నారు. ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న సాగునీరు అందుబాటులోకి రానుండటంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

## హాస్టల్ వాచ్మెన్ ఆత్మహత్యాయత్నం



**నందికొట్కూరు, ఆగస్టు 08 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నంద్యాల జిల్లా మిడుతూరు మోడల్ స్కూల్ బాలికల హాస్టల్‌లో పనిచేస్తున్న వాచ్మెన్ రమణమ్మ (50) మత్తుమాత్రలు సేవించి ఆత్మహత్యాయత్నం చేసింది. విషయం గమనించిన సిబ్బంది ఆమెను స్థానిక ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## 136వ రోజుకు చేరిన శ్రీశైలం ముంపు బాధితుల నిరాహార దీక్ష



**నందికొట్కూరు, ఆగస్టు 08 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** శ్రీశైలం ముంపు బాధితులు 98 జీవో అమలు కోసం చేపట్టిన రిలే నిరాహార దీక్ష 136వ రోజుకు చేరుకుంది. నిర్వాసితులు జయన్న మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల తమకు న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి స్వయంగా హామీ ఇచ్చి అమలు చేయకపోవడం దుర్మార్గమని, ప్రజలు తగు సమయంలో బుద్ధి చెబుతారని అన్నారు. ఉద్యోగాల హామీ అమలు చేయకపోవడం వల్ల బాధితులు కన్నీటి పర్యంతమవుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ దీక్షలో నాగేంద్రుడు, జంభన్న, చంద్రన్న నారాయణ, రవి, నాగరాజు, రామకృష్ణ, జయన్న తదితరులు పాల్గొన్నారు.

## మిర్యాలగూడ ల బీజేపీ శ్రేణుల నిరసన



**మిర్యాలగూడ, ఆగస్టు 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మిర్యాలగూడ పట్టణంలో శాంతియుత వాతావరణాన్ని భంగపరిచేలా కాంగ్రెస్ నాయకులు రాజకీయ అలజడులు సృష్టించారని ఆరోపిస్తూ బీజేపీ టూ టౌన్ అధ్యక్షుడు పెద్ద బోయిన వెంకటేశ్వర్లు యాదవ్ తీవ్రంగా ఖండించారు. ప్రధాని నరేంద్ర మోదీ సేవలను ప్రజలకు తెలియజేస్తూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ బోర్డులపై అసభ్యకరమైన స్టిక్కర్లు అంటించి ప్రధానిని అవమానపరిచిన ఘటనపై బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సంఘటనకు నిరసనగా శనివారం మిర్యాలగూడ టూ టౌన్ పోలీస్ స్టేషన్ సీఐకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, “దేశ ప్రజల కోసం, రైతుల కోసం, కర్షక కార్మిక లోకానికి అహర్నిశలు సేవలందిస్తున్న ప్రధానిని అవమానించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం. ఇలాంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోము” అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రేపాల పురుషోత్తం రెడ్డి, ఎడ్ల రమేష్, మండల నాయకులు సోములు గారు, లక్ష్మారెడ్డి, భాషపాక శంకర్, గుండ్లపల్లి శ్రీకాంత్, వెలుగు నాగరాజు, కేసరి శంకర్, సిగపట్ల రాంబాబు, హరిప్రసాద్, ఐల శ్రీను, ఎడ్ల శృతి, పో రెడ్డి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా నారోజు కుమారస్వామి



**మర్రిగూడ, ఆగస్టు 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మర్రిగూడ మండల కేంద్రంలోని యరగండ్లపల్లి గ్రామానికి చెందిన నారోజు కుమారస్వామి బీజేపీ పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “నా నియామకానికి సహకరించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్ రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గంధమల్ల ఆనంద్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పిట్టల శ్రీనివాస్ గార్లకు హృదయపూర్వక కృతజ్ఞతలు” అని తెలిపారు. బీజేపీ పార్టీ కోసం అహర్నిశలు కృషి చేస్తానని, ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అంకితభావంతో పనిచేస్తానని ఆయన స్పష్టం చేశారు. నారోజు కుమారస్వామి నియామకంపై పలువురు నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## నిరుపేదల పక్షాన నిరంతరం పోరాడేది సిపిఐ పార్టీ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**మర్రిగూడ, ఆగస్టు 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మునుగోడు నియోజకవర్గంలో సిపిఐ పార్టీ చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర మూడో రోజు మర్రిగూడ మండలం శివన్నగూడెం గ్రామంలో కొనసాగింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పార్టీ జెండాను ఆవిష్కరించి, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఆయన మాట్లాడుతూ, “నిరుపేద ప్రజల పక్షాన నిరంతరం పోరాడేది సిపిఐ పార్టీనే. ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాటమే మార్గం” అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ బుర్ర శేఖర్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఈదుల బిక్షం రెడ్డి, మండల కార్యవర్గ సభ్యులు ఆకుల రఘుమయ్య, సర్పంచ్ లింగయ్య, నిరంజన్, చెల్లం పాండురంగారావుతో పాటు సిపిఐ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ రాష్ట్ర అధ్యక్షుడిగా కొండోజు అశోక్ చారి

**కల్వకుర్తి, ఆగస్టు 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం తుర్కలపల్లి గ్రామానికి చెందిన కొండోజు అశోక్ చారి శనివారం బాధ్యతలు స్వీకరించారు. సంస్థ జాతీయ చైర్మన్ నందన్ నరసింహారావు ఆదేశాల మేరకు ఆయనను రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా తుర్కలపల్లి గ్రామస్తులు, పలువురు సామాజిక, రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు, మిత్రులు, శ్రేయోభిలాషులు అశోక్ చారికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. “మానవ హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం, ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన కీలక పాత్ర పోషించాలి” అని ఆకాంక్షించారు. నాయకులు మాట్లాడుతూ, రాష్ట్రంలో మానవ హక్కుల ఉల్లంఘనలకు గురవుతున్న బాధితులకు



అండగా నిలిచి వారికి న్యాయం జరిగేలా కృషి చేయాలని, ప్రజలకు తమ హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని సూచించారు. ముఖ్యంగా మహిళలు, బాలలు, పేదలు, అణగారిన వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలపై చట్టపరమైన అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. అశోక్ చారి మాట్లాడుతూ, “నా మీద నమ్మకంతో రాష్ట్ర అధ్యక్షుడి బాధ్యతలు అప్పగించిన జాతీయ చైర్మన్ నందన్ నరసింహారావుకు కృతజ్ఞతలు. మానవ హక్కుల పరిరక్షణ, బాధితులకు న్యాయం, ప్రజా సమస్యల పరిష్కారం, చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తాను. రాష్ట్రవ్యాప్తంగా సంస్థను విస్తరించి ప్రజలకు సేవలందించేందుకు కృషి చేస్తాను” అని తెలిపారు.

# సీజనల్ వ్యాధుల నివారణ చర్యలు



**ఎలిగేడు, ఆగస్టు 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మండలంలోని ర్యాకల్దేవుపల్లి గ్రామంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు సర్పంచ్ మద్దెల రమాదేవి--సంపత్ తెలిపారు. శనివారం గ్రామంలోని పలు వార్డుల్లో స్వయంగా పర్యటించిన ఆమె, రోడ్లకు ఇరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలు, ముళ్లపొదలకు మందు పిచికారి చేయించారు. గ్రామస్తుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తున్నామని, సీజనల్ వ్యాధుల నివారణకు క్రమం తప్పకుండా చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ పేర్కొన్నారు. గ్రామంలో పరిశుభ్రతను కాపాడటం ద్వారా వర్షాకాలంలో వ్యాధుల ప్రబలాన్ని అరికట్టవచ్చని, ప్రజల ఆరోగ్య రక్షణ కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆమె సూచించారు.

# నారాయణపల్లిలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

**ఎలిగేడు, ఆగస్టు 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండలంలోని నారాయణపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ రంగు లత--శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులకు బాలామృతం పంపిణీ, అన్నప్రాసన, అక్షరాభ్యాసం నిర్వహించారు. అనంతరం తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యతపై విస్తృత అవగాహన కల్పించారు. సర్పంచ్ మాట్లాడుతూ, “తల్లిపాలు శిశువుకు ప్రకృతి ప్రసాదించిన సంపూర్ణ ఆహారం. పుట్టిన గంటలోపే తల్లిపాలు పట్టించడం ద్వారా శిశువు ఆరోగ్యంగా ఎదగడమే కాకుండా వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. తొలి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలి. ఆ తరువాత వైద్యుల సూచనల మేరకు అదనపు పోషకాహారంతో పాటు తల్లిపాలను కొనసాగించాలి” అని సూచించారు. తల్లిపాలు బిడ్డ ఎదుగుదల, మానసిక వికాసం, రోగనిరోధక శక్తి



పెంపుదలలో కీలక పాత్ర పోషిస్తాయని, తల్లుల ఆరోగ్యానికి కూడా మేలు చేస్తాయని ఆమె వివరించారు. అపోహలను తొలగించి ప్రతి తల్లి తన బిడ్డకు తప్పనిసరిగా తల్లిపాలు అందించాలని కోరారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొత్తిరెడ్డి బాపు



రెడ్డి, సెక్రటరీ పాపయ్య, అంగన్వాడీ టీచర్లు సరస్వతి, సరోజ, వార్డు సభ్యులు, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గాయత్రి పాఠశాలలో వైభవంగా బోనాల పండుగ



**ఎలిగేడు, ఆగస్టు 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండలంలోని ధూళికట్ట గ్రామ గాయత్రి పాఠశాలలో శనివారం బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పోతురాజులు, పంబాల పూజారులు వేషధారణలతో ఊరేగింపు నిర్వహించారు. పిల్లలు జమ్మిడికే చప్పుళ్లు, ఈరగోళలు తిప్పుతూ సంప్రదాయ బోనాలతో గ్రామంలో సందడి చేశారు. అనంతరం విద్యార్థుల నృత్యాలు గ్రామస్థులను ఆకట్టుకున్నాయి. మన సంస్కృతి, సంప్రదాయాలను చిన్నప్పటి నుంచే పాఠశాలలోనే అవగాహన కల్పించడం అభినందనీయమని పలువురు గ్రామస్థులు పాఠశాల యాజమాన్యాన్ని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎర్ర పద్మాకర్రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# రాములపల్లిలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు

**ఎలిగేడు, ఆగస్టు 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మండలంలోని రాములపల్లి గ్రామంలో వర్షాల కారణంగా వీధి దీపాలు షార్ట్‌సర్క్యూట్ అయి పాడైపోవడంతో సర్పంచ్ సిద్ది తిరుపతి యాదవ్ స్పందించారు. శనివారం గ్రామంలోని చౌరస్తా వద్ద అమర్చుతున్న సెంట్రల్ లైటింగ్ పనులను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, “గ్రామంలోని వీధులు, రోడ్ల వెంట రాత్రి వేళల్లో నిరంతరం స్ట్రీట్‌లైట్లు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. ప్రజల భద్రత, సౌకర్యం కోసం లైటింగ్ వ్యవస్థను బలోపేతం చేస్తాం” అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తీట్ల విద్యాలత--విజయ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



# నిరుపేద విద్యార్థికి ఉచితంగా పాఠ్యపుస్తకాలు

**- మానవత్వం చాటుకున్న కాకతీయ స్కూల్ యాజమాన్యం**

**వర్ధన్నపేట, ఆగస్టు 8(నీలగిరి ఎక్స్ ప్రెస్):** ప్రైవేట్ పాఠశాలలు అంటే అధిక ఫీజులు, పుస్తకాలు, యూనిఫాం తదితర ఖర్చులతో తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతాయనే అభిప్రాయం సాధారణంగా ఉంది. అయితే అందుకు భిన్నంగా ఓ నిరుపేద విద్యార్థికి ఉచితంగా పాఠ్యపుస్తకాలను అందించి కాకతీయ స్కూల్ యాజమాన్యం మానవత్వాన్ని చాటుకుంది. ఆర్థిక ఇబ్బందులతో చదువుకు అవసరమైన పాఠ్యపుస్తకాలను కొనుగోలు చేయలేని విద్యార్థి పరిస్థితిని గుర్తించిన పాఠశాల యాజమాన్యం వెంటనే స్పందించి, విద్యార్థికి అవసరమైన పుస్తకాలను



ఉచితంగా అందజేసింది. విద్యార్థి చదువుకు ఆర్థిక పరిస్థితులు అడ్డంకిగా మారకూడదనే ఉద్దేశంతో ఈ సహాయం అందించినట్లు యాజమాన్యం గొడిశాల శ్రీనివాస్ పేర్కొన్నారు. సాధారణంగా ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఫీజులు, పుస్తకాలు, ఇతర విద్యా ఖర్చులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో.. ఓ నిరుపేద విద్యార్థికి ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందించడం అభినందనీయమని పలువురు గ్రామస్తులు ప్రశంసించారు. వి ద్యను వ్యాపార కోణంలో కాకుండా సేవా దృక్పథంతో చూడాలి ్సన అవసరం ఉందని, ఆ దిశగా కాకతీయ స్కూల్ యాజమాన్యం తీసుకున్న నిర్ణయం ఇతర విద్యాసంస్థలకు స్ఫూర్తిదాయకమని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు. నిరుపేద విద్యార్థి చదువుకు అండగా నిలిచి, మానవత్వాన్ని చాటుకున్న కాకతీయ స్కూల్ యాజమాన్యాన్ని పలువురు అభినందించారు.

# సిరిసిల్ల నేతన్నల కోసం ‘ఏఐ అండ్ డిజిటల్ టూల్స్’ శిక్షణ

**- కేటీఆర్ ‘గిఫ్ట్ ఏ స్మైల్’ చొరవలో భాగంగా టీఎంఎస్ ఎన్జీవో ప్రతిపాదన**

**- నైపుణ్యం నేర్చుకోండి... అవకాశాలను అందిపుచ్చుకోండి.. భవిష్యత్తును నిర్మించుకోండి!**

**- పిలుపునిచ్చిన సంస్థ వ్యవస్థాపకురాలు దోనికేన పద్మ**

**హైదరాబాద్, ఆగస్టు 8(నీలగిరి ఎక్స్ ప్రెస్):** నేతన్నల కుటుంబాలు, యువత, మహిళా గార్మెంట్ కార్మికులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో తెలంగాణ మహిళా సంఘం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టనుంది. కేటీఆర్ ‘గిఫ్ట్ ఏ స్మైల్ ’ చొరవలో భాగంగా నెల రోజుల పాటు శని, ఆదివారాల్లో 100 శాతం ఉచితంగా ‘ఏఐ అండ్ డిజిటల్ టూల్స్’ పై ప్రాక్టికల్ శిక్షణ అందించేందుకు ప్రతిపాదన సిద్ధం చేసినట్లు సంస్థ వ్యవస్థాపకురాలు దోనికేన పద్మ తెలిపారు. ఈ శిక్షణ ద్వారా నేతన్నలు, మహిళా కార్మికులు స్మార్ట్‌ఫోన్ ద్వారానే ఆధునిక ఏఐ టూల్స్‌ను ఉపయోగించుకునేలా అవగాహన కల్పించనున్నారు. ఏఐ ఆధారిత



సాధనాలతో మోడల్స్, స్టూడియోల అవసరం లేకుండా చీరల ఫోటోషూట్ ఖర్చులను గణనీయంగా తగ్గించుకోవడం, కాన్వా ఏఐ వంటి టూల్స్ సహాయంతో కొత్త చీరల డిజైన్లను రూపొందించడం, చాట్ జీపీటీ వంటి సాధనాల ద్వారా భాషా సమస్యలను అధిగమించి ఇతర రాష్ట్రాల వినియోగదారులతో వ్యాపార సంబంధాలు మెరుగుపరుచుకోవడం వంటి అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. నేతన్నల రోజువారీ ఉపాధికి ఎలాంటి అంతరాయం కలగకుండా శని, ఆదివారాల్లో మాత్రమే తరగతులు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించినట్లు పద్మ పేర్కొనా ్నరు. పటన్ చెరు సిరిసిల్ల, వరంగల్,లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు స్థానిక అధికారుల సహకారంతో పాటు చేనేత సంఘాల భవనాల్లో శిక్షణ తరగతులకు అవకాశం కల్పించాలని కేటీఆర్ కార్యాలయాన్ని కోరినట్లు తెలిపారు. అదే విధంగా విద్యార్థులు ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించి భవిష్యత్తులో గ్లోబల్ ఐటీరంగం అవకాశాలు అందిపుచ్చుకునేలా కీర్తిని లక్ష్యంతో టీఎంఎస్ స్కిల్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమం పూర్తిగా ఉచితంగా ఉంటు ందని ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**- ‘సాంకేతికతను నేతన్నల చేతుల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యం’**

ఏఐ , డిజిటల్ టెక్నాలజీని కేవలం నగరాలకే పరిమితం చేయకుండా సిరిసిల్ల నేతన్నల కుటుంబాలకు చేరువ చేయడం ద్వారా వారి ఉత్పత్తులకు విస్తృత మార్కెట్‌ను కల్పించవచ్చని తెలంగాణ మహిళా సంఘం చైర్మన్ దొనికెన పద్మ తెలిపారు.

# నీటిపారుదలపై సమావేశంలో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి



**నల్లగొండ, ఆగస్టు 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన జిల్లా నీటిపారుదల సలహా మండలి సమావేశానికి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లాలో వర్షపాతం, భూగర్భ జలాల పరిస్థితులపై అధికారులు వివరించారు. ఎల్ నినో ప్రభావం నేపథ్యం లో తీసుకోవాల్సిన చర్యలపై చర్చ జరిగింది. మంత్రి మాట్లాడుతూ, “ప్రతి వాననీటి చుక్కను వడిసి పట్టాలి. ఫార్మ్ పాండ్స్ నిర్మాణం, మున్సిపాలిటీలలో ఇంకుడు గుంతలు తప్పనిసరి. వాల్టా చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి” అని సూచించారు. ఈ సమావేశంలో కలెక్టర్ బి. చంద్రశేఖర్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ మేయర్ ఆమీర్ అలీ, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు తీవ్రం సీఐటీయూ



**నల్లగొండ, ఆగస్టు 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మధ్యాహ్న భోజన పథకంలో పని చేస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోతే ఆందోళన పోరాటాలను తీవ్రతరం చేస్తామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దండెంపల్లి సత్తయ్య, యూనియన్ కార్యదర్శి పోలే సత్యనారాయణ హెచ్చరించారు. నల్లగొండలో జరిగిన జిల్లా సమావేశంలో వారు మాట్లాడుతూ, కార్మికులు తక్కువ పారితోషికాలతో కుటుంబాలను పోషించలేక అప్పుల బాధలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన రూ.10 వేల వేతనం ఇప్పటికీ అమలు చేయలేదని విమర్శించారు. కనీస వేతనం రూ.26 వేల వరకు ఇవ్వాలని, అప్పటివరకు కనీసం హామీ చేసిన రూ.10 వేల వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదనంగా పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని, వంటకు గ్యాస్ ఉచితంగా ఇవ్వాలని, డ్రెస్ కోడ్‌లో కాటన్ దుస్తులు, గుర్తింపు కార్డులు, ప్రమాద బీమా సౌకర్యం కల్పి ంచాలని కోరారు. లేనిపక్షంలో ఈనెల 18, 19, 20 తేదీల్లో మండల కేంద్రాల్లో ధర్నాలు, ఆగస్టు 24న డీఈఓ కార్యాలయం ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ సమా వేశంలో సీఐటీయూ నాయకులు పెంజర్ల సైదులు, అద్దంకి నరసింహ, అరుణ జ్యోతి, అంజమ్మ, సుందర్, శంకరమ్మ, వెంకన్న, ఇంద్రమ్మ, నాగమ్మ, నిర్మల, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 10న నిరసన ర్యాలీ విజయవంతం చేయాలని సీఐటీయూ పిలుపు



**నల్లగొండ, ఆగస్టు 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆగస్టు 10న నల్లగొండ పట్టణంలో జరగనున్న నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.డి. సలీం, ఉపాధ్యక్షుడు దండెంపల్లి సత్తయ్య పిలుపునిచ్చారు. సుభాష్ విగ్రహం నుండి పెద్ద గడియారం వరకు జరిగే ఈ ర్యాలీకి కార్మిక సంఘాలు కరపత్రాల ద్వారా ప్రచారం నిర్వహించాయి. నాయకులు మాట్లాడుతూ, “కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేసి పాత 29 చట్టాలను అమలు చేయాలి. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పగించకుండా కార్మిక హక్కులను రక్షించాలి. రైతులకు మద్దతు ధర చట్టం చేయాలి” అని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న జైల్ బరో కార్యక్రమంలో భాగంగా నల్లగొండ పట్టణంలో నిరసన ప్రదర్శనను కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గంజి నాగరాజు, పెండెం బుచ్చి రాములు, బొమ్మకంటి లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

# పత్యానాయక్‌కు జన్మదిన శుభాకాంక్షల వెల్లువ

**ఆమనగల్లు, ఆగస్టు 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పత్యానాయక్ జన్మదిన వేడుకలు శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణ కేంద్రంలో జరిగిన వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కేక్ కట్ చేసి పత్యానాయక్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు పత్యానాయక్‌ను పూలమాలలు, శాలు వాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం మున్సిపల్ మహిళా కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. కస్తూర్బా గాంధీ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి, విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ పత్యానాయక్ నాయకత్వంలో ఆమనగల్లు మున్సిపాలిటీ అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు మరింత వేగంగా కొనసాగాలని ఆకాంక్షించారు. పత్యానాయక్ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో నిర్వహించడం ద్వారా ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు. పత్యానాయక్‌కు సంపూర్ణ ఆయురారోగ్యాలు కలగాలని, ప్రజాసేవలో మరింతగా రాణించాలని కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు అవ్వారి శివలింగం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, కోఆప్షన్ సభ్యుడు అబ్దుల్ ఖాదర్, సీనియర్ నాయకులు ధనుంజయ, ఖలీల్, కాలే మల్లయ్య, గాజుల శ్రీను, పూసల



సత్యం, పర్వతాలు, ఖాదర్ ఖాద్రి, అండేకర్ రాజు, అబ్దుల్ అలీమ్, కండె సాయి, సురేష్ నాయక్, కరీం, శ్రీధర్ నాయక్, కొండల్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి ఎండీ ఫరీద్, కుమార్ గౌడ్, దేవరశెట్టి మహేష్, నాజర్, రఫీ, గోపాల్, శ్రీను నాయక్, శివ, రాజేందర్ నాయక్, దుడ్డు కృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లు, ఫుట్‌పాత్‌లపై మాంసం విక్రయాలు నిషేధం కమిషనర్ హెచ్చరిక



నల్లగొండ, ఆగస్టు 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):నల్గొండలోని రోడ్లు, ఫుట్‌పాత్‌లు, బహిరంగ ప్రదేశాల్లో మటన్, చేపల విక్రయాలను నిలిపివేయాలని కమిషనర్ బి. వంశీకృష్ణ ఆదేశించారు.అనుమతులు, లైసెన్సులు ఉన్న దుకాణాల్లోనే విక్రయాలు జరగాలని, లేనిపక్షంలో తెలంగాణ మున్సిపాలిటీల చట్టం 2019 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారాంతాల్లో ఫుట్‌పాత్‌లపై అక్రమ విక్రయాలు, వ్యర్థాలను రోడ్లపై లేదా డ్రైనేజీలో పడవేయడం ప్రజా ఆరోగ్యానికి ముప్పు అని పేర్కొన్నారు. "నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు. ప్రజల ఆరోగ్య రక్షణ కోసం వ్యాపారులు సహకరించాలి" అని కమిషనర్ స్పష్టం చేశారు.

## ఘనంగా ఎస్సై శేఖర్ జన్మదిన వేడుకలు



తలకొండపల్లి, ఆగస్టు 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):మండల సబ్ ఇన్స్పెక్టర్ శేఖర్ జన్మదిన వేడుకలను యువ నాయకులు సురేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్టేషన్‌లో కేక్ కట్ చేసి శాలువాలతో సత్కరించారు.సురేష్ మాట్లాడుతూ, "శేఖర్ యువకులకు ఆదర్శప్రాయుడు. ఎప్పుడూ చిరునవ్వుతో, ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తారు. ఉపాధ్యాయుడిగా కలం పట్టి చదువు నేర్పిన ఆయన, నేడు గన్ను పట్టి శాంతి భద్రతలను కాపాడుతున్నారు" అని కొనియాడారు.భవిష్యత్తులో మరెన్నో ఉన్నత స్థానాలు పొందాలని, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు కిరణ్, రమేష్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల ఇబ్బందులకు స్పందించిన పోతుగంటి రాణి



ఆమనగల్లు, ఆగస్టు 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): వంపుగూడ గ్రామంలో రోడ్డు గుంతలతో ప్రజలు, వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన ఒకటో వార్డు మెంబర్ పోతుగంటి రాణి స్పందించారు. క్రషర్ టిప్పర్ల అధిక రాకపోకల కారణంగా రహదారి దెబ్బతిని గుంతలు ఏర్పడటంతో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ కడ్తాల్ మండల అధ్యక్షుడు పోతుగంటి అశోక్ ఆధ్వర్యంలో శనివారం రోడ్డు మరమ్మతు పనులు చేపట్టారు. రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చి రాకపోకలకు అనుకూలంగా తీర్చిదిద్దారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తక్షణమే మరమ్మతు పనులు చేపట్టడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామంలోని రోడ్డు సమస్యలపై అధికారులు కూడా స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరారు. కార్యక్రమంలో గాజుల రాంరెడ్డి, కాయితీ నర్సింహారెడ్డి, గుర్కా మల్లేష్, గండికోట రామచంద్రయ్య, గొర్ల రాములు, గ్రామ పెద్దలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.?

## బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే కసిరెడ్డి భరోసా



ఆమనగల్లు, ఆగస్టు 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): వైద్య చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు సీఎం సహాయనిధి ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో శనివారం కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలోని ఆమనగల్లు, మాడుగుల, తలకొండపల్లి మండలాలకు చెందిన పలువురు బాధితులకు సీఎం సహాయనిధి ఎల్ఓసీ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా బాధితులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితి, వైద్య ఖర్చుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల వైద్య అవసరాలకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకిగా మారకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం సీఎం సహాయనిధి ద్వారా సహాయం అందిస్తోందన్నారు. ఆరోగ్యశ్రీతో పాటు ఇతర ప్రభుత్వ పథకాల ద్వారా పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనం అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయాన్ని బాధితులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో బట్టు కిషన్ రెడ్డి, సురేందర్ రెడ్డి, వంశీ తదితర నాయకులు పాల్గొన్నారు.

## చేనేత కార్మికుల సంక్షేమానికి మరిన్ని చర్యలు చేపట్టాలి

**– ఎంపీ మల్లు రవికి కాంగ్రెస్ నేతల వినతి**



ఆమనగల్లు, ఆగస్టు 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): చేనేత రంగం అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందించి, కార్మికులకు అండగా నిలవాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవిని శనివారం హైదరాబాద్‌లో ఆయన నివాసంలో రాష్ట్ర కాంగ్రెస్ చేనేత విభాగం ప్రధాన కార్యదర్శి గంజి శ్రీనివాస్ నేత, ఆమనగల్లు మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు కలిసి పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఎంపీకి శుభాకాంక్షలు తెలిపి, శాలువాతో సత్కరించారు. చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులు, ఉపాధి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వారు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే చేనేత కార్మికుల కోసం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, రుణమాఫీ ద్వారా కార్మికులకు ఊరట కల్పించిందని పేర్కొన్నారు. చేనేత ఉత్పత్తులకు మార్కెట్ సదుపాయాలు పెంచడంతో పాటు, కార్మికులకు ఆధునిక సాంకేతికత, శిక్షణ, ఆర్థిక ప్రోత్సాహకాలు అందించాలని ఎంపీని కోరారు.

## శ్రమేవ జయతే

జిజ్ఞాసతో
విశ్వవిఖ్యాతి గడించిన
విజ్ఞులెందరో...
జ్ఞానపిపాసతో
అజ్ఞానాంధకారాన్ని తొలగించిన
ఆద్యులెందరో...
ఆశతో
ఆశయాన్ని సాధించిన
సదాశయులెందరో...
అభిలాషతో
అభివృద్ధి పథం నిర్మించిన
అభినందనీయులెందరో...
శోధనతో
వేదనలు తొలగించిన
వివేకులెందరో...
సాధనతో
అసాధ్యాన్ని
సుసాధ్యం చేసిన
సాధకులెందరో...
అందుకే...
ఓ మానవా!
నిరాశ, నిస్పృహలను వీడి
ప్రతికూల ఆలోచనలను వదిలి



సానుకూల దృక్పథంతో
సవ్యపథంలో నడిచి
దివ్యమైన విజయాన్ని
భవ్యమైన కీర్తిని
సాధించు

**శ్రీనివాస్**
**ఉపాధ్యాయుడు**
**కనుకుల**
**స్వగ్రామం: ఎలిగేడు**

## విటమిన్ బి6 మన శరీరంలో ఎన్ని విధులను నిర్వర్తిస్తుందంటే.. దీని ఉపయోగాలు చెప్పలేనివి..




ఆహారం మన శరీరానికి ఇంధనం లాంటిది. అయితే మనం తీసుకునే ఆహారం శరీరానికి అవసరమైన శక్తిగా ఎలా మారుతుంది? ఇందులో విటమిన్ బి6 కీలక పాత్ర పోషిస్తుంది. ఇది నీటిలో కరిగే పోషకం. ఆహారాన్ని శక్తిగా మార్చే ప్రక్రియలో సహాయపడటంతోపాటు మెదడు, నాడీ వ్యవస్థ సక్రమంగా పనిచేయడానికి కూడా ఇది అవసరం. నీటిలో కరిగే పోషకాలను శరీరం ఎక్కువకాలం నిల్వ చేసుకోలేకపోవడంతో, ప్రతిరోజూ ఆహారం ద్వారా తగినంత విటమిన్ బి6ని పొందడం అవసరం. వయస్సు, లింగాన్ని బట్టి విటమిన్ బి6 రోజువారీ అవసరం మారుతుంది. గర్భిణీలు, పాలిచ్చే మహిళలకు కూడా దీని అవసరం భిన్నంగా ఉంటుంది. టర్కీ, అవకాడో, చికెన్, పిస్తా, ట్యూనా చేప, శనగలు, అమరాంత్, పొద్దుతిరుగుడు విత్తనాలు, నువ్వులు, అరటిపండ్లు, ఆలుగడ్డలు, ఫోర్టిఫైడ్ సీరియల్స్, బీన్స్ వంటి ఆహారాల్లో విటమిన్ బి6 లభిస్తుంది.

గుండె ఆరోగ్యానికి..విటమిన్ బి6 గుండె ఆరోగ్యానికి కూడా ఉపయోగకరంగా ఉంటుంది. ప్రొటీన్లు అధికంగా ఉండే ఆహారం తీసుకున్నప్పుడు రక్తంలో హోమోసిస్టీన్ అనే అమైనో ఆమ్లం ఏర్పడుతుంది. ఇది అధికంగా ఉంటే వాపు, గుండె సంబంధిత సమస్యల ప్రమాదం పెరుగుతుంది. రక్తంలోని హోమోసిస్టీన్ స్థాయిలను నియంత్రించడంలో విటమిన్ బి6 సహాయపడుతుంది. ఫోలేట్‌తో కలిసి తీసుకున్నప్పుడు హోమోసిస్టీన్ స్థాయిలను తగ్గించడంలో, భవిష్యత్తులో గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. రక్తపోటు, కొలెస్ట్రాల్ స్థాయిలను నిర్వహించడంలో కూడా ఇది ముఖ్య పాత్ర పోషిస్తుంది. మెదడు పనితీరుకు కూడా విటమిన్ బి6 అవసరం. హోమోసిస్టీన్ అధికంగా ఉండటం నాడీ వ్యవస్థ పనితీరుపై ప్రభావం చూపిస్తుంది. విటమిన్ బి6 లోపం వల్ల జ్ఞాపకశక్తి, ఆలోచనా సామర్థ్యం వంటి మెదడు పనితీరులో సమస్యలు వచ్చే అవకాశం ఉందని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. అంతేకాకుండా అల్జీమర్స్, డిమెన్షియా వంటి సమస్యల ప్రమాదంతోనూ విటమిన్ బి6 లోపం సంబంధం కలిగి ఉంటుంది.

మానసిక స్థితికి..మన మానసిక స్థితిపై కూడా విటమిన్ బి6 ప్రభావం చూపిస్తుంది. మెదడులో సెరొటోనిన్, నోర్‌ఎపినెఫ్రిన్ వంటి మూడ్‌కు సంబంధించిన హార్మోన్ల ఉత్పత్తిలో ఇది సహాయపడుతుంది. వీటి ఉత్పత్తి సక్రమంగా ఉండటం వల్ల మానసిక స్థితి మెరుగుపడటానికి తోడ్పడుతాయి. విటమిన్ బి6 తగినంతగా లభించడం డిప్రెషన్, ఆందోళన వంటి సమస్యలను నివారించడంలో సహాయపడుతుంది. రక్తహీనతను నివారించడంలోనూ విటమిన్ బి6 పాత్ర ఉంటుంది. రక్తంలోని హిమోగ్లోబిన్ శరీరంలోని వివిధ భాగాలకు ఆక్సిజన్‌ను చేరవేస్తుంది. హిమోగ్లోబిన్ తయారీలో విటమిన్ బి6 అవసరం. హిమోగ్లోబిన్ లోపం వల్ల రక్తహీనత ఏర్పడి అలసట, ఒళ్లు నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తాయి. అందువల్ల ఆహారం ద్వారా తగినంత విటమిన్ బి6 పొందడం రక్తహీనతను నివారించడంలో సహాయపడుతుంది. కళ్ల ఆరోగ్యానికి కూడా విటమిన్ బి6 ఉపయోగపడుతుంది. సరైన పోషకాలు అందకపోవడం, పోషకాహార లోపాలు కంటి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపిస్తాయి. విటమిన్ బి6ను ఫోలేట్, మరికొన్ని పోషకాలతో కలిపి తీసుకోవడం వల్ల కొన్ని కంటి సమస్యలు, చూపు కోల్పోయే ప్రమాదాన్ని తగ్గించవచ్చని అధ్యయనాలు సూచిస్తున్నాయి.

రక్తపోటు సమస్యకు..రక్తపోటు ఉన్నవారికి కూడా విటమిన్ బి6 ఉపయోగపడే అవకాశం ఉందని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. దీని వినియోగం పెరగడం వల్ల హైబీపీ ఉన్నవారిలో రక్తపోటు తగ్గే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా ధమనుల్లో కొవ్వు లేదా ప్లాక్ పేరుకుపోకుండా నిరోధించడంలో ఇది సహాయపడుతుంది. తద్వారా గుండె సంబంధిత సమస్యల ప్రమాదాన్ని తగ్గించవచ్చు. మహిళల్లో నెలసరి ముందు కనిపించే పీఎంఎస్ లక్షణాలను తగ్గించడంలో కూడా విటమిన్ బి6 ఉపయోగపడుతుంది. రొమ్ముల్లో నొప్పి, వికారం, కడుపులో మంటలు లేదా తిమ్మిర్లు వంటి కొన్ని లక్షణాల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. నెలసరి ప్రారంభానికి సుమారు 10 రోజుల ముందు బి కాంప్లెక్స్ విటమిన్లు తీసుకోవాలి. ఆస్తమా ఉన్నవారికి కూడా విటమిన్ బి6 ఉపయోగపడుతుందని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. దీన్ని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల ఆస్తమా దాడుల తీవ్రత లేదా తరచుదనం తగ్గే అవకాశం ఉంటుంది. వీజింగ్ వంటి కొన్ని లక్షణాలు కూడా తగ్గుతాయి.

నిద్రలేమి ఉంటే..నిద్ర సమస్యలు, ముఖ్యంగా నిద్రలేమితో బాధపడేవారికి విటమిన్ బి6 ఉపయోగపడుతుంది. శరీరంలో మెలటోనిన్ ఉత్పత్తికి ఇది సహాయపడుతుంది. మెలటోనిన్ మన శరీరంలోని నిద్ర–మేల్కొనే సమయాలను నియంత్రించే హార్మోన్. ఇది సక్రమంగా పనిచేయడం వల్ల ఎప్పుడు నిద్రపోవాలి, ఎప్పుడు మేల్కొనాలి వంటి శరీర సహజ చక్రం మెరుగ్గా కొనసాగుతుంది. కిడ్నీలో రాళ్లు ఏర్పడే అధ్యయనాలు సూచిస్తున్నాయి.

## ఆగస్టు 10న జైల్ బరో విజయవంతం చేయాలని పిలుపు




కల్వకుర్తి, ఆగస్టు 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్మిక--రైతు--ప్రజా వ్యతిరేక విధానాలను వేగంగా అమలు చేస్తోందని ఆరోపిస్తూ, సీఐటీయూ ఆధ్వర్యంలో ఆగస్టు 10న దేశవ్యాప్తంగా జైల్ బరో కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు బి. ఆంజనేయులు తెలిపారు.నాలుగు లేబర్ కోడ్ల ద్వారా ఎనిమిది గంటల పని దినాన్ని 12 గంటలకు పెంచుతూ, సమ్మె హక్కును కాలరాసి, కార్మిక సంఘాల గుర్తింపు రిజిస్ట్రేషన్‌ను కష్టతరం చేశారని ఆయన విమర్శించారు. కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని పేర్కొన్నారు.ఆగస్టు 9న కల్వకుర్తి కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయం ముందు కరపత్రాల ప్రచారం నిర్వహించి, 10న జరిగే జైల్ బరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు పుష్పలీల, మహాలక్ష్మి, లక్ష్మమ్మ, శివలీల, పద్మ, జయలలిత తదితరులు పాల్గొన్నారు.ం

## దేవరకొండలో వీధి కుక్కల దాడి చిన్నారికి తీవ్ర గాయాలు





దేవరకొండ, ఆగస్టు 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):పట్టణంలోని 11వ వార్డు మగ్దుం బాబానగర్ ప్రాంతంలో శనివారం జరిగిన ఘటనలో మూడు సంవత్సరాల పాపపై వీధి కుక్క దాడి చేసింది.స్థానికుల వివరాల ప్రకారం, పానీ పూరి వ్యాపారం చేసే అరుణ్--సోనం దంపతుల కుమార్తె నబియా ఇంటి బయట ఆడుకుంటుండగా ఒక్కసారిగా కుక్క దాడి చేసి గొంతు వద్ద తీవ్రంగా కొరకడంతో చిన్నారి దంతాలు ఊడిపోయాయి.ప్రస్తుతం ఆమెను దేవరకొండ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో అత్యవసర చికిత్స అందిస్తున్నారు. గతంలో కూడా ఇలాంటి దాడులు చోటుచేసుకున్నాయని, మున్సిపల్ అధికారులు వెంటనే చర్యలు తీసుకొని ప్రజలను వీధి కుక్కల బెడద నుండి రక్షించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఎలిగేడు గ్రామంలో పరిశుభ్రతపై సర్పంచ్ ప్రవీణ్ పిలుపు



ఎలిగేడు, ఆగస్టు 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ కప్పల ప్రవీణ్ గ్రామ ప్రజలకు సూచించారు.శనివారం పలు వార్డుల్లో పర్యటించిన ఆయన, ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలకు మందు పిచికారి చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, "డెంగ్యూ, మలేరియా వంటి విషజ్వరాలు రాకుండా ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల చుట్టూ పరిశుభ్రత పాటించాలి. వర్షాకాలంలో కుండలు, కొబ్బరి చిప్పలు, ప్లాస్టిక్ గ్లాసులు, సీసాలు, గోళాలు వంటి వస్తువుల్లో నీరు నిల్వ ఉండకూడదు. నిర్లక్ష్యం చేస్తే దోమలు పెరిగి జ్వరాలకు కారణం అవుతాయి" అని హెచ్చరించారు.ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఆయన గ్రామ ప్రజలను కోరారు.

## గంగాధర్‌కు బీజేపీ ఓబీసీ మోర్చా కీలక బాధ్యతలు



కల్వకుర్తి, ఆగస్టు 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా గండోజు గంగాధర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన శనివారం బీజేపీ జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారిని మర్యాదపూర్వకంగా కలిసి, ఈ గొప్ప అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.తల్లోజు ఆచారి మాట్లాడుతూ, "బీసీల సమస్యలపై ఎన్నో ఏళ్లుగా పోరాటం చేస్తూ, తెలంగాణలో వారి స్థితిగతులపై పూర్తి అవగాహన కలిగిన గంగాధర్‌ను పార్టీ గుర్తించి ఈ బాధ్యతను అప్పగించింది. నాగర్‌కర్నూల్ జిల్లాలో బీసీల సమస్యలపై ఉద్యమించి పోరాటం చేయాలి" అని సూచించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.ం

## హెల్మెట్ ధరించడం మీ ప్రాణానికి రక్ష సీఐ అశోక్ కుమార్



నందికొట్కూరు, ఆగస్టు 08 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి, అది ప్రాణాలకు రక్ష అని టౌన్ సీఐ అశోక్ కుమార్ తెలిపారు. శనివారం కర్నూలు రోడ్డులో వాహనాలను తనిఖీ చేస్తూ ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనం నడపడం వల్ల జ్ఞాపకశక్తి, చూపు తగ్గి ఘోర ప్రమాదాలు జరుగుతాయని హెచ్చరించారు. హెల్మెట్ లేకుండా వాహనం నడపడం చట్టరీత్యా నేరమని, భారీ జరిమానాలు, జైలు శిక్షలు తప్పవని అన్నారు.ప్రాణాలను కాపాడుకోవాలంటే ఎప్పుడూ తాగి డ్రైవ్ చేయకూడదని, ట్రాఫిక్ నియమాలు పాటిస్తే గమ్యం సుఖమయం, కుటుంబం సురక్షితం అవుతుందని వాహనదారులకు సూచించారు.

నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
RNI - TELTEL/2023/87644






## బిడ్డ కోసం సమంత సన్నద్ధత..

### ఆ పుస్తకం చదువుతూ పోస్ట్!

స్టార్ హీరోయిన్ సమంత ప్రస్తుతం తన గర్భధారణ సమయాన్ని ఆస్వాదిస్తున్నారు. తన భర్త, ప్రముఖ దర్శకుడు రాజ్ నిడిమోరుతో కలిసి తొలి బిడ్డకు స్వాగతం పలికేందుకు సిద్ధమవుతున్న ఆమె, మాతృత్వానికి సంబంధించిన సన్నాహాలను ప్రారంభించారు. ఈ క్రమంలో తాను చదువుతున్న ఓ పుస్తకం తాలూకు ఫొటోను శనివారం అభిమానులతో పంచుకున్నారు.
'ఆగస్ట్ ఎనర్జీ' అనే క్యాప్షన్‌తో సమంత ఇన్‌స్టాగ్రామ్‌లో కొన్ని ఫొటోలను షేర్ చేశారు. అందులో ఆమె సోఫాలో విశ్రాంతి తీసుకుంటూ 'ఇనా మేస్ గైడ్ టు చైల్డ్‌బర్త్' అనే పుస్తకాన్ని చదువుతూ కనిపించారు. కాబోయే తల్లిదండ్రులకు ప్రసవానికి సంబంధించిన వివిధ అంశాలపై ఈ పుస్తకం అవగాహన కల్పిస్తుంది. ఈ పోస్టులో జిమ్ సెల్ఫీలతో పాటు తన భర్త పుట్టినరోజు వేడుకలకు సంబంధించిన మధుర క్షణాలను కూడా ఆమె పంచుకున్నారు.గత జూన్ నెలలో హైదరాబాద్‌లో నిర్వహించిన 'మా ఇంటి బంగారం' సక్సెస్ మీట్‌లో సమంత తన గర్భధారణ విషయాన్ని అధికారికంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. "ఈ సినిమా తర్వాత నా ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా చిన్న విరామం తీసుకుంటాను. మెటర్నిటీ లీవ్ తీసుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత మళ్లీ నా అభిమానుల కోసం మరో సినిమాతో తిరిగి వస్తాను" అని ఆమె స్పష్టం చేశారు. గతేడాది డిసెంబర్ 2025లో కోయంబత్తూరులోని ఈశా యోగా సెంటర్‌లో రాజ్ నిడిమోరును సమంత వివాహం చేసుకున్నారు.


## 12న ఇరుముడి ట్రైలర్ విడుదలకు సన్నాహాలు


మాస్ మహారాజా రవితేజ కథానాయకుడిగా తెరకెక్కుతున్న తాజా చిత్రం 'ఇరుముడి' ట్రైలర్‌ను ఆగస్టు 12న విడుదల చేయనున్నారు. భీమవరంలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఈ ట్రైలర్ లాంచ్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. 'నిన్ను కోరి', 'టక్ జగదీష్' వంటి చిత్రాలతో తనదైన గుర్తింపు తెచ్చుకున్న శివ నిర్వాణ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంపై ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి ఆసక్తి నెలకొంది.ఇప్పటివరకు సినిమాకు సంబంధించి విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్, ఇతర ప్రచార చిత్రాలు ప్రేక్షకుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్‌ను అందుకున్నాయి. ముఖ్యంగా కుటుంబ కథాంశానికి భక్తి అంశాలను జోడించి సినిమాను రూపొందిస్తున్నట్లు తెలుస్తుండటంతో 'ఇరుముడి'పై అంచనాలు మరింత పెరిగాయి. ట్రైలర్ విడుదల కార్యక్రమానికి చిత్ర బృందంతో పాటు అభిమానులు, సినీ ప్రేక్షకులు భారీగా హాజరయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే 'ఇరుముడి' నుంచి వచ్చిన ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై పాజిటివ్ వైబ్స్‌ను తీసుకొచ్చింది. దీంతో ట్రైలర్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. కుటుంబ భావోద్వేగాలు, భక్తి అంశాలతో పాటు రవితేజకు సంబంధించిన మాస్ ఎలివేషన్స్‌ను ట్రైలర్‌లో ఎలా చూపించారనేది ఆసక్తికరంగా మారింది. ట్రైలర్ కూడా ప్రేక్షకులను మెప్పిస్తే సినిమా విడుదలకు ముందే హైప్ మరింత పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా రవితేజను శివ నిర్వాణ ఏ తరహా పాత్రలో చూపించారనే విషయం ట్రైలర్ ద్వారా స్పష్టత వచ్చే అవకాశం ఉందని అభిమానులు భావిస్తున్నారు. ఈ సినిమాలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ కథానాయికగా నటిస్తున్నారు. రవితేజ కుమార్తె పాత్రలో బేబీ నక్షత్ర కనిపించనుంది. కుటుంబ బంధాలు, భావోద్వేగాలకు ప్రాధాన్యత ఉన్న కథలో ఈ తండ్రీకూతుళ్ల బంధం కీలకంగా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. మాస్ మహారాజా ఇమేజ్‌కు భిన్నంగా కుటుంబ భావోద్వేగాలను, భక్తి అంశాలను కలగలిపి శివ నిర్వాణ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. దీంతో 'ఇరుముడి' రవితేజ కెరీర్‌లో మరో విభిన్నమైన సినిమాగా నిలుస్తుందా అన్న ఆసక్తి నెలకొంది. కాగా 'ఇరుముడి' ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.




## కొరియన్ కనకరాజుతో హిట్ కొట్టిన వరుణ్ తేజ్

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్‌కు గత కొంతకాలంగా హిట్ కోసం ఎదురుచూస్తున్నారు. తాజాగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'కొరియన్ కనకరాజు' వరుణ్ తేజ్‌కు భారీ ఊరటనిచ్చేలా బాక్సాఫీస్ వద్ద దూసుకెళ్తోంది. మేర్లపాక గాంధీ దర్శకత్వం వహించిన ఈ హారర్ కామెడీ చిత్రంలో వరుణ్ తేజ్ సరసన రితిక నాయక్ హీరోయిన్‌గా నటించింది. సత్య కీలక పాత్రలో కనిపించారు. విడుదలకు ముందు నుంచే మంచి బజ్‌ను సొంతం చేసుకుంది. తాజా సమాచారం ప్రకారం 'కొరియన్ కనకరాజు' ప్రీమియర్స్, తొలి రోజు కలిపి రూ.10.2 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసినట్లు చిత్ర బృందం ప్రకటించింది. హారర్ కామెడీ జోనర్‌లో తెరకెక్కిన సినిమాకు ఇది మంచి ఓపెనింగ్‌గా చెప్పొచ్చు. అంతేకాదు.. వరుణ్ తేజ్ కెరీర్‌లో ఇదే బిగ్గెస్ట్ ఓపెనర్గా నిలిచినట్లు మేకర్స్ వెల్లడించారు. గతంలో వరుణ్ తేజ్‌కు అత్యధిక ఓపెనింగ్ అందించిన 'గద్దలకొండ గణేళిష్' సినిమాను 'కొరియన్ కనకరాజు' అధిగమించింది. దీంతో చాలా కాలం తర్వాత వరుణ్ తేజ్ అభిమానుల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది.దేశీయ మార్కెట్‌తో పాటు ఓవర్సీస్‌లోనూ సినిమా మంచి ఆరంభాన్ని అందుకుంది. ముఖ్యంగా అమెరికాలో ఇప్పటివరకు 1.75 లక్షల డాలర్ల గ్రాస్ సాధించినట్లు సమాచారం. సినిమా థియేట్రికల్ రైట్స్‌కు అనుగుణంగా చూస్తే ఇదే ట్రెండ్‌ను కొనసాగిస్తే బ్రేక్ ఈవెన్ దిశగా వెళ్లే అవకాశాలు ఉన్నాయని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. విడుదలకు ముందే అడ్వాన్స్ బుకింగ్స్‌లో కూడా 'కొరియన్ కనకరాజు' మంచి జోరు చూపించింది. బుక్‌మైషో, డిస్ట్రిక్ట్ యాప్‌లలో కలిపి 2.5 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడైనట్లు చిత్ర బృందం వెల్లడించింది. తొలి రోజు వసూళ్లతో పాటు సినిమాకు వస్తున్న మౌత్ టాక్ కూడా పాజిటివ్‌గా ఉండటం మేకర్స్‌కు మరింత కలిసొచ్చే అంశంగా మారింది.






## చిక్ కేఫే స్టైల్‌లో పూజా హెగ్డే గ్లామర్ షో.. యెల్లో డ్రెస్ హైలైట్!


బుట్టబొమ్మ పూజా హెగ్డే మరోసారి తన గ్లామర్‌తో సోషల్ మీడియాను షేక్ చేస్తున్నారు. విదేశీ వీధుల్లో, ఒక వినూత్నమైన కేఫే బ్యాక్‌డ్రాప్‌లో దిగిన ఆమె లేటెస్ట్ ఫొటోలు ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. పసుపు రంగు బాడీకాన్ డ్రెస్‌లో తన స్టైలిష్ లుక్స్‌తో కుర్రకారు హృదయాలను కొల్లగొడుతున్నారు. క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్ ఇస్తూ షేర్ చేసిన ఈ గ్లామరస్ పిక్స్ అభిమానులను అమితంగా ఆకట్టుకుంటున్నాయి. ఆ ఫొటోషూట్ విశేషాలు మీకోసం.బుడాపెస్ట్ కేఫేలో చిక్ అండ్ గ్లామరస్ లుక్: ప్రస్తుతం వెకేషన్ మూడ్‌లో ఉన్న పూజా హెగ్డే, బుడాపెస్ట్‌లోని ఒక వినూత్నమైన కేఫేలో ఈ సరదా ఫొటోషూట్ చేశారు. గోడల నిండా చేతిరాత నోట్లు, నేలపై ఎండుగడ్డి చల్లి ఉన్న క్రియేటివ్ కేఫేలో ఒక కలప స్టూల్‌పై కూర్చుని ఆమె క్యూట్‌గా ఫోజులిచ్చారు. "పుట్ ద పెస్ట్ ఇన్ బుడాపెస్ట్" అని తన ఫొటోలకు ఇచ్చిన సరదా క్యాప్షన్ నెటిజన్లను భలే ఆకట్టుకుంటోంది. యెల్లో అవుట్‌ఫిట్ అట్రాక్షన్: ఈ ఫొటోషూట్‌లో పూజా హెగ్డే ధరించిన యెల్లో కలర్ ఫిట్టెడ్ మినీ డ్రెస్ ఆమె అందాన్ని మరింత పెంచింది. డీప్ వి-నెక్‌లైన్‌తో ఉన్న ఈ అవుట్‌ఫిట్‌కు తోడు ఓవర్ సైజ్డ్ క్రీమ్ షేడ్ సన్ గ్లాసెస్, కలర్‌ఫుల్ ప్యాటర్న్డ్ వేస్ట్ బ్యాగ్ మరియు హైహీల్డ్ మెటాలిక్ ప్లాట్‌ఫార్మ్ శాండల్స్‌ను మ్యాచ్ చేశారు. ఇక తన పక్కనే కలర్‌ఫుల్ బ్యాగ్ ఉంచి, ఒక చేతితో జుట్టును సరిచేసుకుంటూ ఆమె ఇచ్చిన క్యూట్ స్మైల్ నెటిజన్లను ఫిదా చేస్తోంది. తొలి అడుగు నుంచి సౌత్, నార్త్ పాన్ ఇండియా రేంజ్: 'ముగమూడి' అనే తమిళ సూపర్ హీరో చిత్రంతో వెండితెరకు పరిచయమైన పూజా, తెలుగులో 'ఒక లైలా కోసం', 'ముకుంద' చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.

## 1 బిలియన్ కలెక్షన్ల క్లబ్‌లో చేరిన ది ఒడిస్సీ

హాలీవుడ్ ప్రముఖ దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్ తెరకెక్కించిన తాజా విజువల్ వండర్ 'ది ఒడిస్సీ' బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టిస్తోంది. థియేటర్లలో విడుదలైన మూడు వారాల్లోనే ఈ ఫాంటసీ యాక్షన్ డ్రామా ప్రపంచవ్యాప్తంగా 1 బిలియన్ కలెక్షన్ల క్లబ్‌లో (దాదాపు రూ.9,500 కోట్లకు పైగా) అడుగుపెట్టింది క్రిస్టోఫర్ నోలన్ కెరీర్‌లో 1 బిలియన్ మార్కును అందుకున్న మూడో చిత్రంగా 'ది ఒడిస్సీ' నిలిచింది. అంతకుముందు ఆయన దర్శకత్వం వహించిన 'ది డార్క్ నైట్' (1.008 బిలియన్), 'ది డార్క్ నైట్ రైజెస్' (1.08 బిలియన్) ఈ ఘనత సాధించాయి. గతేడాది వచ్చిన 'ఓపెన్‌హైమర్' ఈ మార్కుకు కాస్త దూరంలో ఆగిపోయింది. కాగా, ఈ వీకెండ్ ముగిసేసరికి 'ది ఒడిస్సీ' నోలన్ కెరీర్‌లోనే అత్యధిక కలెక్షన్లు సాధించిన చిత్రంగా నిలవడం ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు. ఒక్క ఐమాక్స్ స్క్రీన్ల నుంచే ఏకంగా 257 మిలియన్ డాలర్ల వసూళ్లు (దాదాపు రూ.2,445 కోట్లు) రావడం విశేషం. త్వరలోనే ఐమాక్స్ చరిత్రలోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగానూ ఇది నిలవనుంది. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మార్కెట్ అయిన చైనాలో ఈ సినిమా విడుదల కావాల్సి ఉంది. చైనా వ్యాప్తంగా దాదాపు 800 ఐమాక్స్ స్క్రీన్లతో పాటు వేలాది సాధారణ స్క్రీన్లలో అత్యంత భారీ స్థాయిలో విడుదల చేయడానికి మేకర్స్ ఎ÷-లాన్ చేస్తున్నారు. దీంతో ఈ సినిమా మరిన్ని రికార్డులను తిరగరాయడం ఖాయంగా కనిపిస్తోంది.




## రామాయణ తొలుత విదేశాల్లో విడుదల



రామాయణం ఇతిహాసం ఆధారంగా తెరకెక్కుతోన్న ప్రతిష్టాత్మక చిత్రం 'రామాయణ' ప్రపంచవ్యాప్త విడుదలపై నిర్మాత నమిత్ మల్హోత్రా కీలక ప్రకటన చేశారు. ఈ సినిమాను అంతర్జాతీయ మార్కెట్‌లో ముందుగా.. ఆ తర్వాత భారత్‌లో విడుదల చేసేలా వినూత్న వ్యూహాన్ని అనుసరిస్తున్నట్లు వెల్లడించారు. తాజాగా ఓ ఆంగ్ల మీడియాతో ఆయన మాట్లాడారు. నవంబర్ 6న విదేశాల్లో 'రామాయణ' విడుదల చేస్తున్నాం. విదేశీ మార్కెట్లలో సినిమాల విడుదల సాధారణంగా శుక్రవారం నుంచే ప్రారంభమవుతుంది. ఇండియాలో మాత్రం దీపావళి నవంబర్ 8 రోజే విడుదల చేస్తాం అని చెప్పారు. దిగ్గజ దర్శకుడు నితీశ్ తివారీ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ భారీ బ్జడెట్ దృశ్యకావ్యంలో శ్రీరాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణాసురుడిగా యష్, హనుమంతుడిగా సన్నీ దేవోల్, లక్ష్మణుడిగా రవి దూబే నటిస్తున్నారు. ఆస్కార్ విజేతలు ఏ.ఆర్. రెహమాన్, హన్స్ జిమ్మర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఇండియాలో ధర్మ ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని పంపిణీ చేస్తుండగా, ఓవర్సీస్ హక్కులను సోనీ పిక్చర్స్ దక్కించుకుంది. సంగీత హక్కులను టీ-సిరీస్ రూ. 75 కోట్లకు సొంతం చేసుకున్నట్లు సమాచారం.